

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**కృష్ణదేవరాయలును టీడీపీపీ నేతగా గుర్తించండి**

- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు సీఎం చంద్రబాబు లేఖ

8

**సీఎస్ నీరభ్‌కుమార్ పదవీ కాలం ఆరు నెలలు పొడిగింపు**

8

# ప్రజల మనిషి రామోజీ

- సవాళ్లపై జయభేరి మోగించిన వీరుడు
- వ్యాపార రంగంలోనూ ప్రజాహితం చూసిన ఏకైక వ్యక్తి
- విలువలతో పత్రికను నడిపిన అక్షర యోధుడు
- వేధింపులకు రాజీపడని మీడియా శిఖరం
- ఒకే ఎన్టీఆర్, ఒకే రామోజీ ఉంటారు.. ఎవరూ అధిగమించలేరు
- తెలుగుజాతి వెలుగు, స్ఫూర్తి రామోజీకి భారతరత్న ఇవ్వాలి
- అమరావతిలో ఒక రహదారికి, విశాఖలో చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం
- రాజధానిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం
- రామోజీరావు సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు ఘన నివాళి

2





## నాన్న వారసత్వం కొనసాగిస్తాం

- రామోజీ తనయుడు, ఈనాడు ఎండీ కిరణ్ ఉద్ఘాటన
- అమరావతికి రూ.10 కోట్ల విరాళం

5



### పొలిటికల్ పెన్‌కౌంటర్



ఉద్రిక్తతలు రెచ్చగొట్టి, ఘర్షణలు రేపేందుకు టీడీపీ, జనసేన నాయకులు ప్రయత్నించడం దారుణం. పోలీసులు వారిని నియంత్రించడం లేదు. సరికదా అక్రమాలకు దన్నుగా నిలబడ్డారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులకు తావివ్వడం శాంతిభద్రతలను ప్రమాదంలో పడేయడమే.

ఐదేళ్లుగ సాగించెను
ఫ్యాక్షనిస్టు రాజకీయం!?
కూటమితో బ్రేకుపడెను..
అక్రమాల బాగోతం!!

కన్నుమిన్ను గానలేదు
ఏడ్చినపుడు జనాలు!?
ఓడినాక గుర్తుకొచ్చె..
ప్రజల శాంతి భద్రతలు!!

ఫ్యానుపార్టీ అక్రమాలు
చరిత్రనుంచి చెరపలేవు!
ఐదుకోట్ల ఆంధ్రులపై
దాష్టీకం దాచలేవు!!

అబద్ధాలు వల్లించుట
ఫ్యాను పార్టీ పేటెంటు!
అయిన జనం నమ్మరుగా..
నవ్యాంధ్రులు వెరీ స్మార్టు!!

-మహాదేవ

## విశ్వసనీయతకు విశ్వరూపం

రామోజీరావుకు రాష్ట్ర విద్యా, ఐటీశాఖల మంత్రి లోకేష్ నివాళి

4

- అమరావతికి నామకరణం చేసిన చరితార్థుడు
- గొప్ప సాహసికుడు, విజనరీ
- ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజసేవ చేసిన ధన్యజీవి
- అక్షరం రూపంలో ఎప్పుడూ మనమధ్యే ఉంటారు





### త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- పార్లమెంట్ ఉభయ సభల సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- వివరాలు 15 లో..



### విలువలపై రాజీపడని యోధుడు రామోజీ

- ప్రజాహితమే ధ్యేయంగా బతికారు
- రాజధానిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలి
- సంస్మరణ సభలో డిప్యూటీ సీఎం పవన్

3

### రూ.40 వేల కోట్ల ఖనిజాన్ని బొక్కిన వైసీపీ నేతలు

- అధికారంలో ఉండగా ఇష్టానుసారం దోపిడీ
- ప్రస్తుతం అక్రమాలకు చెక్ పెడుతున్న అధికారులు
- గగ్గోలు పెడుతున్న అవినీతి పుత్రిక 'సాక్షి'

9

### ఐదేళ్లలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారు

- పోలీసుల పనితీరులో మార్పు తెస్తాం
- రెడ్‌బుక్ అనేది కక్ష సాధింపుల కోసం కాదు
- నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు
- ప్రజల భాగస్వామ్యంతో గంజాయిని అరికడతాం
- హోం మంత్రి అనిత స్పష్టీకరణ

8

### 1న ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

- ఒక్క రోజులోనే పంపిణీ పూర్తికావాలి
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 6కే పంపిణీ ప్రారంభించాలి
- ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు కేటాయింపు
- అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ నీరభ్ కుమార్ ఆదేశం

9



# ప్రజల మనిషి రామోజీ

- సవాళ్లపై జయభేరి మోగించిన వీరుడు
- వ్యాపార రంగంలోనూ ప్రజాహితం చూసిన ఏకైక వ్యక్తి
- విలువలతో పత్రికను నడిపిన అక్షర యోధుడు
- వేధింపులకు రాజీపడని మీడియా శిఖరం
- ఒకే ఎన్టీఆర్, ఒకే రామోజీ ఉంటారు.. ఎవరూ అధిగమించలేరు
- తెలుగుజాతి వెలుగు, స్ఫూర్తి రామోజీకి భారతరత్న ఇవ్వాలి
- అమరావతిలో ఒక రహదారికి, విశాఖలో చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం
- రాజధానిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం
- రామోజీరావు సంస్మరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళి



కానూరు/అమరావతి(చైతన్యరథం): వ్యాపార రంగంలోనూ ప్రజాహితాన్ని చూసిన ఏకైక వ్యక్తి రామోజీరావు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. సమాజం కోసం ఆలోచించి వ్యాపార, సినీ, సేవా, పత్రికారంగాల్లో రామోజీరావు తనకుతానే సాటిగా నిలిచారన్నారు. విలువలతో పత్రికను నడిపిన అక్షర యోధుడు రామోజీరావు అన్నారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభకు తన సతీమణి భువనేశ్వరితో కలిసి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామోజీరావు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... ఈ సమాజానికి ఎంతో మేలు చేసిన రామోజీరావుకు ఏ విధంగా కృతజ్ఞత చెప్పగలుగుతామనడానికి ఘనంగా నివాళులర్పించడమే మార్గం అన్నారు. ఆయనలోని స్ఫూర్తిని అందిపుచ్చుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సాధారణ కుటుంబంలో పుట్టి స్వయంకృషితో అసామాన్యమైన వ్యక్తిగా ఏ విధంగా ఎదుగుతారనడానికి రామోజీ ఒక ఉదాహరణ. ఒకే ఒక ఎన్టీఆర్ ఉంటారు... ఒకే ఒక రామోజీరావు ఉంటారు. ఆ ఇద్దరినీ జీవితంలో ఎవరూ అధిగమించ లేరు. రామోజీ అసాధారణ శక్తి. ఆయన వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ. రామోజీరావు వ్యవస్థలను నిర్మించారు. అయన ఏ రంగాన్ని తీసుకున్నా నెంబర్-1గా నిలబెట్టారు. ఏం చేపట్టినా ఉన్నతస్థాయిలో ఆలోచించారు. పద్ధతి ప్రకారం నిజాయితీగా పనిచేశారు. ప్రజాస్వామ్యం కోసం యోధునిలా పోరాటం చేశారు. మీడియా రంగంలో చేసిన కృషికి అనేక అవార్డులు వచ్చాయి. కేంద్రం కూడా పద్మవిభూషణ్ ఇచ్చి గౌరవించింది. రామోజీ సమాజానికి చేసిన సేవకు ఆ పురస్కారాలు లభించాయని సీఎం చంద్రబాబు అన్నారు.

## విశ్వసనీయతకు మారుపేరు రామోజీ

1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ స్థాపించారు. అంతకముందు... తర్వాత అనేక చిట్‌ఫండ్ సంస్థలు వచ్చాయి...కానీ మార్గదర్శినేటికీ మార్గదర్శిగానే ఉంది. గత ప్రభుత్వాలు మార్గదర్శిపై ఎన్ని కుట్రలు చేసినా ఆ సంస్థపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టలేక పోయారు. ఎన్ని ఇబ్బందులువచ్చినా మార్గదర్శిలో పెట్టుబడిపెట్టిన వారు ఆయనతో ఉన్నారంటే అది రామోజీ పట్ల ఉన్న విశ్వాసం, విశ్వసనీయత. 1969లో అన్నదాత పత్రిక తెచ్చి రైతులకు ఎనలేని సేవలు అందించారు. 1974 ఆగస్టు 10న ఈనాడు దినపత్రికను విశాఖలో స్థాపించారు. 5 దశాబ్దాలుగా ఈనాడు పత్రిక ప్రజా చైతన్యం కోసం పని చేస్తోంది. 22 జిల్లా ఎడిషన్లు ప్రవేశపెట్టి వినూత్నమైన ఆలోచనతో ప్రజాసమస్యలను వెలుగులోకి తెచ్చారు. పాలకుల వైఫల్యాలను ఎండ గట్టారు. రాజకీయాల్లో ఉన్న మేము ప్రతిపక్షంలో ఉంటే ప్రజల సమస్యలపైన పోరాటం చేస్తాం...అధికారంలో ఉంటే సమస్యలు పరిష్కారిస్తాం. కానీ రామోజీ పత్రికా రంగంలో ఉండి ప్రజాసమస్యలుపై నిరంతరం పోరాడారు. 40 ఏళ్లుగా ఈనాడు నెంబర్-1గా ఉందంటే దాని వెనక రామోజీ కార్యదక్షత, కృషి ఉన్నాయి. కొన్ని వందల మంది జర్నలిస్టులను, నటీనటులను, గాయకులను, కళాకారులను తయారు చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఒకేసారి 7 ఛానెల్స్ పెట్టి జయప్రదం చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## సేవాభావంతో ముందుకెళ్లారు

హైదరాబాద్ వెళ్లిన ఎవరైనా రామోజీ ఫిల్మ్ సిటీ చూడకుండా తిరిగొచ్చే పరిస్థితి లేదంటే అందులో ఆయన పడ్డ కష్టం ఉంది. విపత్తులు వచ్చినప్పుడు సేవాభావంతో రామోజీ ముందుకెళ్లారు. తుఫాన్లు వస్తే మన తెలుగురాష్ట్రాలైనా, ఇతర రాష్ట్రాలైనా సేవలందించారు. పెదపారుపూడి, తెలంగాణలోని నాగన్ పల్లి గ్రామాలను దత్తత తీసుకుని రూ.25 కోట్లతో అభివృద్ధి చేశారు. కోవిడ్ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.20 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు సేవలందించారు. 40ఏళ్లుగా నేను రామోజీని దగ్గరుం డి చూశాను... అయనలో భయం లేదు. పోరాటం అయన జీవితంలో భాగం. ఏ విషయంలోనైనా రాజీలే కుండా పోరాటం చేశారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ నెంబర్-1గా ఎలా ఉంటారో... తెలుగువారికి సేవలందించిన వ్యక్తిగా రామోజీని కూడా తెలుగు జాతి శాశ్వతంగా గుర్తు పెట్టుకుంటుందని సీఎం చంద్రబాబు అన్నారు.

## విలువల కోసం రామోజీ బతికారు

ఈ రోజుల్లో రేటింగ్‌ల కోసం ఛానళ్లు, పత్రికలు పెట్టి.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వద్దకెళ్లి పనులు చేసుకుంటున్నారు. నాకు ఒక పని చెయ్యి, చెప్పిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వు, మంత్రి పదవి ఇవ్వు అని ఏనాడూ అడగలేదంటే అదీ రామోజీ నీతి, నిజాయితీ. ప్రజాస్వామ్యం అపహాస్యం అయినప్పుడు తన వంతుగా వచ్చి పోరాడారు. చాలా మంది పదవులుంటేనే సేవ చేస్తామనుకుంటారు..కానీ రామోజీ తనకు కావాల్సింది పదవులు కాదు ప్రజా చైతన్యంతో ప్రజలకు మేలైన సేవలందిస్తానని నిరూపించారు. 1982 వరకు కాంగ్రెస్‌పార్టీకి ప్రత్యామ్నాయం లేదు... ప్రత్యామ్నాయం కోసం ఆలోచించి పార్టీ పెట్టిన 9 నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారంటే అందులో రామోజీరావుది కూడా ప్రముఖ పాత్ర ఉంది. తరువాత ఎన్టీఆర్ ప్రభుత్వానికి ఆగస్టు సంక్షోభం వస్తే ప్రజా స్వామ్యాన్ని కాపాడటం కోసం రాజీలేని పోరాటం చేశారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు స్వేచ్ఛ ఉంటుంది. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియారంగం ప్రజాస్వామ్యానికి పిల్లర్ లాగా ఉంటుంది. ఈనాడు పత్రికలో వార్తకు ఒకసారి ఉల్లంఘన కింద నోటీసులు ఇస్తే సుప్రీం కోర్టులో కూడా పోరాడి నిలబడ్డారని సీఎం చంద్రబాబు చెప్పారు.

## రామోజీ సూచనతోనే రాజధానికి అమరావతి పేరు

మార్గదర్శిపైనా అనేక కేసులు పెట్టారు...ఆయన్ను రకరకాలుగా హింసించారు. నేను ప్రజల కోసం పోరాడుతున్నా... సంపాదించిన ఆస్తులన్నీ పోయినా ఫర్వా లేదని రాజీపడకుండా పోరాడారు. 86ఏళ్ల వయుసులో మంచంపై ఉన్నా ప్రజలకు న్యాయం జరగాలని కోరుకున్నారు. నేను ఆయన్ను చూసి నేర్చుకున్న మేరకు... వినూత్నంగా సైబరాబాద్ నిర్మించి అభివృద్ధి చేశాను. హైదరాబాద్ అభివృద్ధిలో రామోజీ స్ఫూర్తి, ఆలోచనలు ఉన్నాయి. విభజన అనంతరం ఏపీ రాజధానికి ఏ పేరు పెడితే బాగుంటుదని నేను ఆలోచిస్తే ఎంతో పరిశోధన చేసి అమరావతి పేరు పెట్టాలని నాకు సూచించారు. దాంతో ప్రపంచమంతా అమరావతి అని మారుమోగింది. నూటికి నూరుశాతం ప్రజలు ఆమోదించిన నగరం అమరావతి. గత 5 ఏళ్లు అమరావతి ఇబ్బంది పడినా... మళ్లీ అమరావతి దశ, దిశ మారుతుంది... తెలుగుజాతి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుంది. రామోజీ ఎవరినీ ఆయన వద్దకు పిలవరు... తన వద్దకు ఎవరైనా రావాలని కోరుకోరు. వస్తే గౌరవంగా మాట్లాడి... ఉన్నది ఉన్నట్లు చెప్తారు. కొన్ని పత్రికలు ఉన్నాయి... వేరే పార్టీలకు సంబంధం చిన వార్తలు ప్రచురించవు... కానీ రామోజీరావు మాత్రం ప్రతిపార్టీకి, నాయకుడి సంఖ్యాబలాన్ని బట్టి ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన అభిప్రాయాలను ఎడిటోరియల్ పేజీలో మాత్రమే రాశారు. నా పాలనపైనా ఎన్నో వార్తలు రాశారు. కానీ ఆయన ఒకే మాట అన్నా రు... నేను పత్రికా రంగంలో ఉన్నాను... నన్ను ఎన్ని సార్లు కలిసినా నా స్వేచ్ఛకు భంగం కలగకూడదు.. మిమ్మల్ని నేను ఏమీ అడగను... నన్ను మీరు ఏమీ అడగొద్దు అని చెప్పి విలువల కోసం బతికారు. పని చేస్తూనే చనిపోవాలని కోరుకున్నారు. నిరంతరం పని చేయాలన్నది ఆయన ఆలోచన. ఈ ఆలోచన కొంత మంది మాత్రమే చేయగలుగుతారు. చనిపోయినప్పుడు కూడా ఎక్కడ అంత్యక్రియలు చేయాలో ముందుగానే నిర్ణయించుకున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## తెలుగు భాషన్నా... తెలుగు జాతన్నా ఎనలేని ఆప్యాయత

తెలుగు భాష అంటే రామోజీకి ఎనలేని అభిమానం...తెలుగుజాతి అంటే ఎనలేని అప్యాయత. తెలుగు జాతి, మనదేశం ఎప్పుడూ బాగుండాలని, విలువలతో కూడిన సమాజం ఉండాలని రామోజీ కోరుకున్నారు. తెలుగు ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా... రామోజీ వారసత్వం కొనసాగించాలి. కిరణ్, వారి కుటుంబ సభ్యులను కూడా కోరుతున్నా...రామోజీ, అయన స్థాపించిన వ్యవస్థ 10కోట్ల మంది ప్రజల ఆస్తి. రామోజీ స్థాపించిన వ్యవస్థలను భావితరాలకు అందించాలి. తెలుగు జాతిలో ఆయన స్ఫూర్తి ఉండాలి. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మనమంతా ఎప్పటి నుండో అడుగుతున్నాం... రామోజీరావుకు కూడా భారతరత్న అడగడం మనందరి బాధ్యత. ఎన్టీఆర్, రామోజీరావు ఇద్దరూ ఇద్దరే అని సీఎం చంద్రబాబు అన్నారు.

## అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం

అమరావతి... రాజధానికి ఆ పేరు పెట్టాలని నాకు సలహా ఇచ్చారు. అందుకే ఆయన గుర్తుండేలా అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఏదైనా ఒక రహదారికి రామోజీరావు మార్గం అని పేరు పెడతాం. విశాఖలో ఆయన జీవితాన్ని ప్రారంభించి, పేపరు స్థాపించినందున అక్కడి చిత్రనగరికి రామోజీ చిత్రనగరిగా పేరు పెడతాం. ఎంతోమంది పుడతారు.. చనిపోతారు.. కొంతమంది మాత్రమే చరిత్రలో నిలుస్తారు. రామోజీరావు లాంటి వారే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. ఆయన సంస్మరణ సభ నిర్వహించడం నా అదృష్టం. రామోజీరావుకు తగిన గుర్తింపు ఇస్తాం. రామోజీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు సంస్మరణ సభకు పలువురు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రామోజీరావు కుటుంబ సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు ఎన్.రామ్, గులాబ్ కొఠారి, రాష్ట్ర మంత్రులు, సినీ ప్రముఖులు హాజరై పుష్పాంజలి ఘటించారు. పత్రికా రంగంతోపాటు వివిధ రంగాల్లో రామోజీరావు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయన సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. వేదిక వద్ద రామోజీరావు జీవిత విశేషాలతో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా ప్రముఖులు వీక్షించారు.



చైతన్యరథం

# విలువలపై రాజీపడని యోధుడు రామోజీ

- ప్రజాహితమే ధ్యేయంగా బతికారు
- రాజధానిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలి
- సంస్మరణ సభలో డిప్యూటీ సీఎం పవన్

కానూరు: విలువల కోసం బతికి, వాటికోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు రామోజీరావు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఈనాడు గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు, పద్మవిభూషణ్ రామోజీరావు సంస్మరణ సభకు హాజరైన పవన్ మాట్లాడుతూ రామోజీరావు గురించి అందరూ చెప్పిన దాని కంటే, తన అనుభవంలో రామోజీరావు గురించి ఎంతో తెలుసుకున్నానని వెల్లడించారు. రామోజీరావు సినీ రంగంలో ఉన్నప్పటికీ ఆయనతో తనకు పరిచయం లేదని తెలిపారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలినాళ్లలో 2008లో మొదటిసారిగా రామోజీరావును కలిశానని వెల్లడించారు. రామోజీరావు మాట్లాడే విధానం చాలా నిక్కచ్చిగా ఉండేది. ఆయన ప్రజల పక్షపాతి అని అర్థమైంది. ఆయన మాట్లాడుతున్నంత సేపూ నా మదిలో ఒకటే ఆలోచన... పాత్రికేయ విలువలను కాపాడడానికే ఆయన ఉన్నారనేది స్పష్టంగా అర్థమైంది. ఆయన నాతో మాట్లాడినంత సేపూ ప్రజా సంక్షేమం కోణంలోనే చర్చ జరిగింది. 2019లో ఒకసారి లంచ్‌కు ఆహ్వానించారు. ఆ సందర్భంగా దేశ పరిస్థితులు, పత్రికా స్వేచ్ఛ గురించి, తాను ఎప్పుడూ రాజీ పడకపోవడం గురించి చెప్పారు. ఆయనతో మాట్లాడుతుంటే, పత్రికా స్వేచ్ఛ అనేది ఈ దేశానికి ఎంత అవసరమో అర్థమైంది.అంతేకాదు... పరిచయస్థులు కానీ, సన్నిహితులు కానీ, ఇంకెవరి పట్ల అయినా గానీ... ప్రజా ప్రయోజనాల కోణం నుంచి చూస్తే ఆయన వైఖరి చాలా నిర్దాక్షిణ్యంగా ఉంటుందని పవన్ అన్నారు.

## నమ్మిన విలువలు పాటిస్తూ..

ఆయనను ఎన్ని ఇబ్బందులు పెట్టారో మనకందరికీ తెలుసు. దినపత్రిక నడపడం ఎంతో కష్టమైన పని. తాను నమ్మిన విలువలు పాటిస్తూ పత్రిక నడిపే వ్యక్తి ఇతర వ్యాపారాలు చేస్తుంటే, ఆయనపై దాడులు చేయడం సులువు. కానీ అలాంటి దాడులను కూడా ఎదుర్కొని ముందుకు సాగిన వ్యక్తి రామోజీరావు. ఆయనను కలిసిన సమయంలో ఒక్కటే చెప్పారు... నువ్వు పైకొస్తున్న రాజకీయ నాయకుడివి. నీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను... జీవితంలో ఎప్పుడూ రాజీపడొద్దు... నువ్వు ఏదైతే నమ్ముతావో దాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించు అని చెప్పారు. ఆయన మాటలు ఇప్పటికీ నేను మర్చిపోలేదని పవన్ చెప్పారు.



## మా విజయవార్త విన్నాకనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఆయన సంస్మరణ కార్యక్రమంలో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఓ దశలో ఆయన కుటుంబ సభ్యులను కూడా పాలకులు ఇబ్బందిపెట్టారు... ఎంతయినా నలిగిపోతాను కానీ ఓ జర్నలిస్టుగా రాజీపడను అని పోరాడిన వ్యక్తి రామోజీరావు. అలా పోరాడాలంటే ఎంతో సాహసం ఉండాలి. ఇటీవల ఎన్నికల ఫలితాలు వచ్చే ముందే ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వస్తోంది. కానీ, మా కూటమి విజయ వార్త ఆయన వినాలి అని గట్టిగా కోరుకున్నాను. శైలజా కిరణ్‌ని కూడా అడిగాను... ఆయనకు సరిగ్గా వినిపించడం లేదంటున్నారు కదా... మా విజయ వార్త విన్నారా అని అడిగి తెలుసుకున్నాను. దశాబ్దకాలం పాటు నలిగిపోయిన వ్యక్తి ఆ విజయ వార్త వినకపోతే ఆయన ఆత్మ క్షోభిస్తుందేమో అనిపించింది. కానీ విజయ వార్త వినే ఆయన కన్నుమూశారు. ఆ విషయం నాకు తృప్తినిచ్చింది. రాజధాని అమరావతిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలి. అటువంటి మహానుభావుడికి నా నివాళులు అర్పిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సురక్షిత తాగునీటి సరఫరా మన ధ్యేయం

**- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం**

విజయవాడ: ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేసేలా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం వినియోగించుకోలేకపోయిందన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఈపథకం నిధులను వినియోగించుకోలేకపోయిందని వ్యాఖ్యానించారు. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తాగునీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి పెట్టాలని, జల్‌జీవన్ మిషన్ పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల ని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఏడీసీ సీఎండీగా లక్ష్మీ పార్థసారథి

అమరావతి: అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, ఎండీగా విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీ పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.
2014- 2019 మధ్య కాలంలో ఏడీసీ సీఎండీగా లక్ష్మీపార్థసారథి వ్యవహరించారు. రాజధాని మాస్టర్ ప్లాన్ సహా అమరావతి అభివృద్ధిపై అవగాహన ఉండటంతో తిరిగి ఏడీసీ సీఎండీగా ఆమెను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని ప్రాంతంలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని కొత్తపాలెం వద్ద ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఇన్నోవా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది.
ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా లక్ష్మీపురానికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత ఉద్యోగి సోమసి బాలగంగాధర్ శర్మ(78), ఆయన సతీమణి యశోద(67), డ్రైవర్ మృతి చెందారు. బాలగంగాధర్ శర్మ కుమారుడు హెచ్ఎస్‌వై శర్మ, ఆయన భార్య నాగసంధ్య, వీరి పిల్లలు కార్తీక్, అనుపమ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో శర్మ, అనుపమ పరిస్థితి విషమంగా ఉందని వినుకొండ పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి గుంటూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# గత ప్రభుత్వం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా వేదనకు గురి చేసింది

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఏడాదిన్నరగా జీతాలు కూడా చెల్లించలేదా?
- ఒక్కో విభాగం లెక్కలు చూస్తుంటే వైసీపీ పాలకుల ఆర్థిక అరాచకం ఆందోళన కలిగిస్తోంది
- బ్లాక్ లిస్టులో ఉన్న కాంట్రాక్టర్లకు పనులు ఎలా అప్పగించారు?
- అలాంటి కాంట్రాక్టర్లకు బిల్లులు ఏ మేరకు చెల్లించారో నివేదిక ఇవ్వండి
- గ్రామాలవారీగా చేపట్టిన పనుల వివరాలు స్థానిక ప్రజలకు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలి
- పి.ఆర్. అండ్ ఆర్డీ, ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీరింగ్ విభాగాల సమీక్షలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి, చైతన్యరథం: డేటా ఎంట్రీ ఆపరేటర్లు లాంటి చిరుద్యోగులకు ఏడాదిన్నరగా జీతాలు చెల్లించకుండా గత ప్రభుత్వం చేసిన నిర్వాకం మూలంగా ఆ చిన్నపాటి ఉద్యోగుల కుటుంబాలు వేదనతో ఉన్నాయి... ఒక్కో విభాగం లెక్కలు చూస్తుంటే వైసీపీ పాలకుల ఆర్థిక అరాచకం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పి.ఆర్. అండ్ ఆర్డీ, ఆర్.డబ్ల్యు.ఎస్., పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కచ్చితంగా ప్రతి శాఖలో గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపుపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. గురువారం ఉదయం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పి.ఆర్. అండ్ ఆర్డీ, ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీరింగ్ విభాగాల సమీక్ష నిర్వహించారు.

సమీక్ష సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రివర్యులు బయలుదేరగా క్యాంపు కార్యాలయం వెలుపల వేచి ఉన్నవారిని చూసి వాహనం నిలిపారు. పి.ఆర్. ఇంజనీరింగ్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేస్తున్న మహిళలు తమకు ఏడాదిన్నరగా జీతాలు చెల్లించడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు రావలసిన జీతాలు చెల్లించే ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలని కోరారు. ఈ విధంగా బాధపడుతున్న వారు 129మంది ఉన్నామని, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల ఆరోగ్య ఖర్చులకు కూడా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ 'శాఖాపరమైన సమీక్షలు మొదలుపెట్టి, వివిధ పథకాల అమలు, నిధుల వినియోగంపై నివేదికలు పరిశీలిస్తున్నాము. కచ్చితంగా ఈ అంశాన్ని చర్చిస్తాము' అన్నారు.

## రోడ్లు ధ్వంసమైపోయాయి

సమీక్ష సమావేశంలో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం మొదలుపెట్టిన రోడ్లు, వంతెనల పనులు, వాటికి కేంద్రం నుంచి వచ్చిన నిధులు, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నుంచి సమీకరించిన రుణం.. వాటి వినియోగంపై కూలంకషంగా చర్చించారు. ప్రధానంగా కేంద్రం అమలు చేసే పి.ఎం.జి.ఎస్.వై., ఆర్.సి.పి. డబ్ల్యు.ఈ., ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాల ద్వారా వచ్చిన నిధులు ఏ మేరకు వినియోగించారో చర్చించారు. పెండింగ్ లో ఉన్న పనులు, అందుకు కారణాలను తెలిపే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రహదారులు పాడైపోయిన తీరుపై చర్చించారు. ఏ మేరకు దెబ్బ తిన్నాయో, ఎంత కాలం నుంచి మరమ్మతులు చేయడం లేదో చెబుతూ, రోడ్ల కోసం కేటాయించిన నిధులను ఏం చేశారో తెలుపుతూ నివేదిక ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏఐఐబీ నుంచి వచ్చిన రుణాన్ని వినియోగించుకోవడంలోనూ గత ప్రభుత్వ వైఫల్యాలను గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారులు వేస్తే ఆ మొత్తాన్ని రీ ఎంబర్స్ చేస్తామని ఏఐఐబీ చెప్పిందని తెలిసి ఉప ముఖ్యమంత్రివర్యులు ఆశ్చర్యపోయారు.

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేయకుండా, నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడుతున్నారా లేదా అని ప్రశ్నించారు. బ్లాక్ లిస్టులో ఉన్నవారికి ఏ విధంగా పనులు అప్పగిస్తున్నారు, ఆ జాబితాలో ఉన్నవారికి బిల్లులు చెల్లింపులు ఎలా చేశారో తెలుపుతూ వివరాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు క్వాలిటీ విభాగాన్ని బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ నిధులతో ఏ ప్రాంతంలో ఏ పని చేస్తున్నామో, అందుకు సంబంధించి అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, బడ్జెట్ వివరాలు ప్రజలకు తెలియచేలా బోర్డులు పెట్టాలనే నిబంధన ఉన్నా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కచ్చితంగా ఆ బోర్డులు ఏర్పాటు చేయాలని, శాఖ చేసే పనుల వివరాలు స్థానికులకు తెలియచేయాల"ని ఆదేశించారు. ఈ సమావేశంలో పి.ఆర్. అండ్ ఆర్.డి. ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆ శాఖ ఈ.ఎన్.సీ. బాలు నాయక్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం



# విశ్వసనీయతకు విశ్వరూపం

**రామోజీరావుకు రాష్ట్ర విద్యా, ఐటీశాఖల మంత్రి లోకేష్ నివాళి**

- అమరావతికి నామకరణం చేసిన చరితార్థుడు
- గొప్ప సాహసికుడు, విజనరీ
- ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజసేవ చేసిన ధన్యజీవి
- అక్షరం రూపంలో ఎప్పుడూ మనమధ్యే ఉంటారు



అమరావతి (చైతన్యరథం): జీవితంలో ఏదైనా సాధించాలి అనుకునే వాళ్లకి రామోజీరావు జీవితాన్ని మించిన పాఠ్యాంశం ఏ బిజినెస్ స్కూల్‌లోనూ, ఏ యూనివర్సిటీలోనూ దొరకదని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శ్రమయేవ జయతే అనే పదానికి పర్యాయపదం. విశ్వసనీయతకు విశ్వరూపం రామోజీరావు అని లోకేష్ కొనియాడారు. విజయవాడ శివారు కానూరులో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ రామోజీ సంస్మరణ సభ సందర్భంగా ఆ అక్షర యోధుడికి లోకేష్ నివాళులర్పించారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండటం అనే పదానికి మానవరూపం కల్పిస్తే అది రామోజీరావు. సంపూర్ణ మానవుడికి ఉండాల్సిన విశిష్ట లక్షణాలు అనేకం రామోజీరావులో ఉన్నాయి. ఒకప్పుడు మీడియాలో ఏదైనా వార్త వస్తే నిజం అనుకునే వాళ్లు. ఇప్పుడు 'నిజమా..?' అనుకుంటున్నారు. ఇలాంటి రోజుల్లో కూడా ఈనాడు – ఈటీవీలో ఒక వార్త వచ్చిందంటే అది నిజమే అని జనం నమ్ముతున్నారంటే అదీ రామోజీరావుకి ఉన్న విశ్వసనీయత. ఈ ప్రపంచంలో డబ్బుంటే దేనినైనా కొనుక్కోవచ్చు. ఒక్క విశ్వసనీయతని తప్ప. అది అమెజాన్‌లో ఆర్డర్ ఇస్తే దొరికే వస్తువు కాదు. విశ్వసనీయత అనేది ఒక్కో ఇటుక పేర్చి నిర్మించుకునే సౌధం లాంటిది. కాలం దానికి ప్రతి రోజూ అనేక పరీక్షలు పెడుతుంది. వాటిని తట్టుకుని విశ్వసనీయతని కాపాడుకోవటం ఒక పెద్ద ఛాలెంజ్. రామోజీరావు తన 62 ఏళ్ల వ్యాపార సామ్రాజ్యంలో వెనకేసుకుంది ఏదైనా ఉంది అంటే అది... విశ్వసనీయతే. దానిని మించిన సంపద లేదు. కేవలం కోటికి ఒకరికి మాత్రమే అది సాధ్యం. దేశంలో ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ అనేవి చాలా డెలికేట్‌గా ఉంటాయి. ఏ చిన్న అనధికార వార్త వచ్చినా అవి వణికిపోతాయి. జనం మీద పడిపోతారు. అవి నేషనల్ బ్యాంక్స్ కానీ, ప్రైవేట్ ఇనిస్టిట్యూషన్స్ అయినా సరే. కానీ రామోజీరావు మార్గదర్శి మాత్రం అందుకు మినహాయింపు. గత పాలకుడు, ప్రభుత్వం మార్గదర్శి మీద ఆరోపణలు చేసి, ఫిర్యాదులు చేసి, ప్రజల సొమ్ములకు గ్యారంటీ లేదు, ఈ సంస్థను నమ్మకండి అని పేపర్లో అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా ఇచ్చారు. అయినా ఒక్కరంటే ఒక్క ఖాతాదారు కూడా మార్గదర్శిని అనుమానించలేదు అంటే అదీ రామోజీరావు క్రెడిబులిటీ అంటే. కొంతమంది ఎన్ని జన్మలెత్తినా అలాంటి విశ్వసనీయతను పొందలేరని లోకేష్ ఉద్ఘాటించారు.

## పదవులు ఆశించని మహోన్నత వ్యక్తి

కొంతమంది మీడియా సంస్థలు పెట్టి వివిధ పార్టీల వద్ద రాజ్యసభ సభ్యత్వం వంటి పదవులు తీసుకున్నవాళ్లు ఉన్నారు. కానీ రామోజీరావు ఏనాడూ వాటిని ఆశించలేదు. నిజానికి వచ్చిన అవకాశాలను కూడా తిరస్కరించారు. ఎలాంటి ప్రతిఫలాపేక్షా లేకుండా సమాజానికి సేవ చేశారు. సృజనాత్మకత, కొత్తగా ఆలోచించటం అనేవి రామోజీరావులో ఉన్న విశిష్ట లక్షణాలు. అవే ఆయన వ్యాపార సంస్థల విజయానికి కారణం. అందుకే రామోజీరావు అంటే ప్రతి తెలుగువాడు తమ కుటుంబ పెద్దగా భావిస్తారు. ఒక వర్గం మీడియా రామోజీరావు మీద ప్రతిరోజూ బురద చల్లుతున్నా ఏ రోజూ కూడా ఆయన వాటికి కౌంటర్ ఇవ్వలేదు. కనీసం ప్రతిస్పందించలేదు. కారణం ఏంటంటే... ఆయన తనపై వచ్చే విమర్శలను పట్టించుకోరు. కేవలం తన కర్తవ్యం మీద మాత్రమే దృష్టి పెడతారు. అందుకే ఆయన గ్రేట్ హ్యూమన్ బీయింగ్‌గా నిలిచారు. కొండల్లో, గుట్టల్లో భూతల స్వర్గం లాంటి రామోజీ ఫిలింసిటీని నిర్మించాలి అనే ఆయన ఆలోచనే ఒక సాహసం. ఆయనో గొప్ప విజనరీ అని లోకేష్ కొనియాడారు.

## తెలుగుభాషా ప్రేమికుడు

తెలుగుభాషకు పట్టం కట్టి, పట్టాభిషేకం చేసిన భాషా ప్రేమికుడు. తెలుగుజాతి ఘనకీర్తి శాశ్వతంగా నిలిచిపోయేలా ఆంధ్రుల రాజధానికి అమరావతిగా నామకరణం చేసిన చరితార్థుడు రామోజీరావు. సద్విమర్శలను స్వీకరించటం, నిరాడంబరంగా ఉండటం, నిత్య విద్యార్థిలాగా నిరంతరం కొత్త విషయాలను తెలుసుకోవటానికి ఆసక్తి చూపటం ఇవన్నీ ఆయనలో ఉండే గొప్ప లక్షణాలు. దేశంలో 1975లో ఎమర్జెన్సీ నుంచి రాష్ట్రంలో నేటి జగన్ పాలన వరకు అధికారంలో ఉన్న వాళ్లు తప్పు చేసినప్పుడు, ప్రజల హక్కులను కాలరాచినప్పుడు రామోజీరావు ధైర్యంగా ఎదురుతిరిగారు.

ప్రజల తరపున ప్రశ్నించారు. ఆ క్రమంలో వ్యక్తిగతంగా ఎంత నష్టం వాటిల్లినా ఆయన లెక్క చేయలేదు. అదీ ఆయనకు ప్రజల పట్ల ఉన్న కృతజ్ఞతా భావం. రామోజీరావు భౌతికంగా మన మధ్య లేకపోయినా అక్షరం రూపంలో ఎప్పుడూ మన మధ్యనే ఉంటారని ఒక ప్రకటనలో లోకేష్ నివాళులర్పించారు.













చైతన్యరథం

# నాన్న వారసత్వం కొనసాగిస్తాం

## రామోజీ తనయుడు, ఈనాడు ఎండీ కిరణ్ ఉద్ఘాటన | అమరావతికి రూ.10 కోట్ల విరాళం

కానూరు: ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని ఆయన తనయుడు, 'ఈనాడు' ఎండీ కిరణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభలో కిరణ్ మాట్లాడుతూ.. ప్రజల హక్కులను పాలకులు కబళించినప్పుడల్లా రామోజీ బాధితుల పక్షం వహించేవారన్నారు. దేశంలో ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండేవారు. ఆయన నమ్మిన పాటించిన విలువలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తామని మా కుటుంబ సభ్యులు, నా తరపున సభా ముఖంగా మాటిస్తున్నా. నాన్నగారి స్ఫూర్తితో ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామీ ఇస్తున్నా. రాజధాని అమరావతి కోసం రూ.10 కోట్లు విరాళం ప్రకటిస్తున్నాం. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పేరు రామోజీరావు సూచించారు. దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి ఎదగాలని నాన్నగారు ఆకాంక్షించారు. ఈ సభ నాన్నగారి ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే సంకల్ప సభగా భావిస్తున్నాం. సంస్మరణ సభ నిర్వహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు నాన్నగారు పరితపించేవారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నాన్నగారు అండగా నిలిచారు. నాన్నగారి వారసత్వాన్ని కొనసాగిస్తామని కిరణ్ అన్నారు. అమరావతి నిర్మాణానికి విరాళంగా ప్రకటించిన రూ. 10 కోట్ల చెక్కును సభా వేదికపైనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కిరణ్ అందించారు.




### అందనంత ఎత్తుకు: మంత్రి పార్థసారథి



రామోజీరావు అతి సామాన్య కుటుంబంలో పుట్టి అత్యున్నత స్థితికి ఎదిగారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అడుగుపెట్టిన ప్రతి రంగంలో ఎవరెస్టు శిఖరంలా అందనంత ఎత్తుకు ఎదిగారన్నారు. పత్రిక ద్వారా సమాజంలో అనేక మార్పులు తెచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎవరైనా ఉన్నతస్థితికి చేరుకోవచ్చని నిరూపించారు. ప్రజాసమస్యలపై పత్రిక ద్వారా కలం ఝుళిపించారని మంత్రి పార్థసారథి అన్నారు.

### పోరాటయోధుడు రామోజీ: ఎన్.రామ్

రామోజీరావుతో తనకు వ్యక్తిగతంగా మంచి పరిచయం ఉందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, హిందూ దినపత్రిక మాజీ ఎడిటర్ ఎన్.రామ్ అన్నారు. ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా ఆయన ఉన్నప్పుడు ఆ పరిచయం ఏర్పడిందన్నారు. రామోజీరావు.. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజాన్ని నమ్మేవారు. అప్పట్లో దేశ రాజకీయాలు చాలా ఆసక్తికరంగా ఉండేవి. రాజీవ్ ప్రభుత్వం తెచ్చిన పరువునష్టం బిల్లులో కఠిన నిబంధనలు పెట్టారు. పాత్రికేయులే లక్ష్యంగా ఆ నిబంధనలు రూపొందించారు. పరువునష్టం బిల్లుపై ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా రామోజీ పోరాడారు. ఆయన పోరాటం ఫలితంగా ఆ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకుంది. ఈనాడు పత్రిక సమాజంలోని క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పట్టింది. ఈనాడు ప్రస్థానంపై ఆస్ట్రేలియన్ రాజకీయవేత్త రాబిన్ జెఫ్రీ ఒక పుస్తకం కూడా రాశారని ఎన్ రామ్ చెప్పారు.

### సమాజంపై చెరగని ముద్ర: గులాబ్ కొఠారి

రామోజీరావుతో తనకు 40 ఏళ్లుగా పరిచయం ఉందని రాజస్థాన్ పత్రిక ఎడిటర్ గులాబ్ కొఠారి చెప్పారు. ఆయన ప్రజల సమస్యలపై కలం కదిలించారు. సమాజంలో అనేక రంగాల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కృతి, సంప్రదాయాలకు రామోజీరావు ఎక్కువ విలువ ఇచ్చేవారు. ఎప్పుడూ ప్రజా సమస్యల గురించే ఆలోచించేవారని కొఠారి అన్నారు.

### భారతరత్న ఇవ్వాలి: రాజమౌళి



రామోజీరావు తన జీవితంలో ఎన్నో శిఖరాలు అధిరోహించారని దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. తెలుగు ప్రజలకు ఎంతో చేసిన ఆయనకు మనమేం చేయగలం అంటూ, రామోజీరావుకు భారతరత్న ఇవ్వడం సముచితం, సబబు అని ఉద్ఘాటించారు. రామోజీరావుకు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని రాజమౌళి కోరారు.

### రామోజీలా ఒక్కరోజు బతికినా చాలు: కీరవాణి

పాత్రికేయ, సినీ రంగాలలో దిగ్గజ స్థాయికి ఎదిగిన వ్యక్తి రామోజీరావు అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పేర్కొన్నారు. మహోన్నతమైన వ్యక్తిత్వానికి రామోజీరావు ప్రతీక అని కొనియాడారు. ఆయనలా ఒక్కరోజు జీవించగలిగినా చాలు అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. రామోజీరావు సంగీత దర్శకుడిగా తనకు జన్మనిచ్చారని, ఉషా కిరణ్ మూవీస్ లో పీపుల్స్ ఎన్ కౌంటర్ చిత్రంతో సంగీత దర్శకుడిగా తన ప్రస్థానం మొదలైందని కీరవాణి గుర్తు చేసుకున్నారు. రామోజీరావు వద్ద ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు.



### ఎంతోమంది చిన్న నటులకు లైఫ్ ఇచ్చారు: మురళీమోహన్

విజయవాడలో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభకు సీనియర్ సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. రైతు కుటుంబం నుంచి వచ్చి అనేక రంగాల్లో రాణించారని పేర్కొన్నారు. రామోజీరావు ఉషాకిరణ్ మూవీస్ సంస్థను స్థాపించి సినీరంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఎంతో మంది చిన్న నటులకు అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించారని మురళీమోహన్ వెల్లడించారు. సమాజాన్ని జాగృతం చేసేలా, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా సినిమాలు తీయాలని ఆయన ఎప్పుడూ అంటుండేవారని తెలిపారు.



### ఇది నాకు దక్కిన అదృష్టం: జయసుధ

రామోజీరావు సంస్మరణ సభలో పాల్గొనడం తనకు దక్కిన అదృష్టమని సినీనటి జయసుధ అన్నారు. రామోజీరావు ఒక విజ్ఞాన సర్వస్వమన్నారు. క్రమశిక్షణతో ఆయన ఎదగడమే కాకుండా తన పక్కనున్న వారిని కూడా పైకి తీసుకొచ్చారని కొనియాడారు. చిత్ర పరిశ్రమలో ఎంతోమందికి సెకండ్ ఇన్నింగ్స్ ఆయన వల్లే సాధ్యమైంది.. ఆయన నిర్మించిన సినిమాల్లో నటించడం తాను చేసుకున్న అదృష్టమని జయసుధ అన్నారు.



---

# నేడు, రేపు పలుజిల్లాల్లో తేలికపాటి వర్షాలు

## వెల్లడించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

అమరావతి (చైతన్యరథం): ద్రోణి ప్రభావంతో నేడు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖ పట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే గుంటూరు, పల్నాడు,ప్రకాశం, నెల్లూరు, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఉరుములతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు,పశు-గొర్రెల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. గురువారం రాత్రి 8 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 79.5మిమీ, విజయ నగరం జిల్లా పూసపాటిరేగలో 77.7మిమీ, శ్రీకాకుళం జిల్లా నందిగంలో 65మిమీ, అల్లూరి జిల్లా అరకులో 55మిమీ, విజయనగరం నెల్లిమర్లలో 51మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని, దాదాపు 88 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు.

# బోనులో చిక్కిన చిరుత

ఒంగోలు: ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం దేవనగరంలో చేపట్టిన ఆపరేషన్ చిరుత ఎట్టకేలకు విజయవంతంగా సుఖాంతమైంది. దాదాపు 24 గంటల పాటు ఆ ప్రాంత వాసులను చిరుత పులి తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. చివరకు అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో గురువారం రాత్రి చిక్కుకుంది. దీంతో ఆ చిరుతను అడవుల్లో వదిలివేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం దేవనగరం గ్రామ పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే చిరుతపులి అకస్మాత్తుగా గ్రామ సమీపంలో ఓ గుంతలో పడిపోయింది. దాంతో స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు చిరుతపై సమాచారం అందించారు. ఆ క్రమంలో చిరుతను బోనులోకి చిక్కేలా ఏర్పాట్లు చేశారు. కానీ చీకటి పడడంతో.. రెస్క్యూ ఆపరేషన్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ క్రమంలో ఈ రోజు ఉదయం.. చిరుత బోనుకు చిక్కేలా ఏర్పాట్లు చేశారు. కానీ చిరుత మాత్రం రెండు సార్లు గుంతలో నుంచి బయటకు వచ్చింది. కానీ అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులోకి మాత్రం వెళ్లలేదు. దీంతో అటవీ శాఖ అధికారులు మరో ప్లాన్ సిద్ధం చేశారు. అందులోభాగంగా ట్రాక్టర్ ద్వారా నీటిని తెప్పించి గుంతలోకి వదిలే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుంతలోని చిరుత.. బోనులోకి వెళ్లిపోయింది. దాంతో దేవనగరం పరిసర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## సంపాదకీయం

# వైసీపీ వెలిసిపోయింది!

సుపరిపాలనలో ఉన్న వ్యక్తులు అంతకుమించిన స్వేచ్ఛ కోసం వెతక్కూడదు. ఎందుకంటే -మంచి ప్రభుత్వానికి మించిన గొప్ప స్వేచ్ఛ మరొకటుండదు. కాని -నవ్యాంధ్ర ప్రజలు గడచిన ఐదేళ్లలో ఆ స్వేచ్ఛనే వెతుక్కున్నారు. సుపరిపాలనకు నిర్వచనమే తెలియని నియంత ఏలుబడిలో -కష్టాలు కడతేరే క్షణాల కోసం ఊపిరి ఉగ్గబెట్టారు. విధ్వంసం కళ్లముందు కరాళ నృత్యం చేస్తుంటే.. ఐదు కోట్ల ప్రజ చేష్టలుడిగి చూడాల్సి వచ్చింది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాల్సిన రాష్ట్రంలో.. వ్యక్తిస్వామ్యం వికటాట్టహాసం చేస్తుంటే -గుండెబాధను గొంతులో అదిమి పెట్టారు. కాలమెప్పుడూ ఒక తీరున ఉండదు. ప్రజా కంటకులను ఎల్లవేళలా క్షమించదు. అది చరిత్ర చెప్పే సత్యం! జగన్ జమానాలో అష్టకష్టాలు పడిన బాధితులే.. భార్గవ రాముళ్లయ్యారు. సమర్థ నాయకుడు పూరించిన చైతన్య శంఖారావంతో సార్వత్రిక సమరం సాగించారు. ఓటు అస్త్రంతో ప్రజా కంటకుడిని తుదముట్టించారు. ఐదేళ్ల తరువాత -ఇప్పుడు మళ్లీ రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. కొత్త సర్కారు కొలువుదీరి పక్షం కాకమునుపే -ప్రజాస్వామ్య పాలనానుభూతి ఆస్వాదిస్తున్నారు. 'ప్రజా ప్రభుత్వ' ఫలాలూ అందుకుంటున్నారు! గత పాలకుడిపట్ల రాష్ట్ర ప్రజల దృక్పథానికి -సార్వత్రిక ఎన్నికల తీర్పు నిలువుటద్దం. జగన్ ఆనవాలును కూడా జీర్ణించుకోలేమన్నంత కసి.. తీర్పులో కనిపించింది. ప్రజాభీష్టం మేరకు చంద్రబాబు సర్కారు సైతం -విధ్వంసకుడి ఆనవాళ్లను సమూలంగా చెరిపేసే చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులో ప్రధానం -రాజముద్రతో భూహక్కు పత్రాలు అందించాలన్న నిర్ణయం!

ఏ ప్రభుత్వమైనా 'భూహక్కు పత్రం' జారీ చేయడం మామూలే. భూదందాలకు తెరలేపిన వైసీపీ ఏలుబడిలో రీసర్వే నిర్వహించి జారీచేసిన భూహక్కు పత్రానికి 'జగనన్న' పేరు తగిలించడమే దారుణం. పేరుతోపాటు ఫొటోనూ అచ్చేశాడు జగను. రీ సర్వే పూర్తైన 4,618 గ్రామాల్లో 20.19 లక్షల 'జగనన్న భూహక్కు పత్రాలు' ఏకబిగిన జారీ చేశాడు. పూర్వీకులు వారసత్వంగా ఇచ్చిన, కష్టపడి సంపాదించుకున్న భూములపై జగను పెత్తనమేంటన్న భావన కలిగింది ప్రజలకు. బాహాటంగా వ్యతిరేకిస్తే వేధించి ఉసురు తీస్తారన్న భయంతో కిక్కురుమలేదు. పగదీర్చుకునే అవకాశం కోసం ఎదురు చూసింది రైతాంగం. రాక్షసుడి బొమ్మ పోవాలంటే, గద్దెదించడమే మార్గమనుకున్నారు. సాక్షాత్తూ పులివెందులలోనే ముఖ్యమంత్రి భార్య ముఖంమీదకు జగన్ బొమ్మపత్రాన్ని వైసీపీ కార్యకర్త విసిరికొట్టాడంటే -రైతుల్లో పెల్లుబికిన వ్యతిరేకతను అంచనా వేయొచ్చు. అప్పటికే జగన్ సర్కారు తెచ్చిన భూహక్కు నల్లచట్టంపై విరుచుకుపడిన చంద్రబాబు -సాక్ష్యం ఎన్నికల ప్రచారంలో తన విధానాన్ని స్పష్టం చేశారు. భూ హక్కుల చట్టం పేరిట ప్రజల ఆస్తులను కొల్లగొట్టడమే జగన్ కుట్రగా అభివర్ణిస్తూ.. పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో ఏంటని ప్రశ్నించారు. జగన్ ఫొటోవున్న పాస్ పుస్తకాన్ని తగలబెట్టారు. అధికారంలోకి రాగానే -పేదల ఆస్తిని కొల్లగొట్టే చట్టానికి చరమగీతం పాడతామన్న భరోసానిచ్చారు. జగన్ సర్కారు ఓటమికి.. కూటమి అప్రతిహత విజయానికి -భూహక్కు పత్రం ఓ కారణం. అధికారంలోకి వచ్చిన తడవునే భూహక్కు చట్టం రద్దు దస్త్రంపై సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, తాజాగా కుప్పం పర్యటనలో.. రాజముద్రతో కూడిన భూహక్కు పత్రాలిస్తామంటూ ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పటికే అందించిన 20.19 లక్షల జగనన్న భూహక్కు పత్రాలను ఉపసంహరించి.. ఇవ్వాల్సిన వాటితో కలిపి రాజముద్రతో భూహక్కు పత్రాలు అందించేందుకు కొత్త సర్కారు సన్నాహాలు చేయడం శుభతరుణం.

గద్దెనెక్కిన మరుక్షణం నుంచే జగన్ తీసుకున్న నియంత నిర్ణయాలపైనా -ప్రజా ప్రభుత్వం దృష్టిపెట్టింది. విలువలను గాలికొదిలేసి.. ప్రజాస్వామ్యానికి పాతరేసి.. కీర్తికండూతితో ప్రభుత్వ పథకాలకు తన పేరు తగిలించుకున్నాడు జగన్. జేబు సొమ్మును ఉదారంగా ధారబోస్తున్నట్టు.. పథకాలకు జగన్ పేరు తగిలించడంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత లేకపోలేదు. 'జగనన్న' అంటూ నిస్సిగ్గుగా జగనే తన పేరు తగిలించుకున్న పథకాల పేర్లను కూటమి ప్రభుత్వం మార్చడం.. విధ్వంసకుడి ఆనవాళ్లను పూర్తిగా చెరిపేయడమే. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాదీవెన పథకాల పేర్లను 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్'గా మార్చింది కూటమి సర్కారు. ఎస్సీలకు అమలవుతున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం పేరును 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి'గా మార్చారు. వైఎస్సార్ కల్యాణమస్తు పథకాన్ని చంద్రన్న పెళ్లికానుకగా, వైఎస్సార్ విద్యోన్నతి పథకాన్ని ఎన్టీఆర్ విద్యోన్నతిగా, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పేరును సివిల్ సర్వీస్ పరీక్ష ప్రోత్సాహకం'గా మారుస్తూ కొత్త సర్కారు ఉత్తర్వులివ్వడం -ప్రజాభీష్టానికి పెద్దపీట వేయడమే! కొత్త సర్కారు నిర్ణయాలతో -నియంత ఆనవాళ్లు చెరిగిపోతున్నాయి. వైసీపీ -వెలిసిపోయింది!

## మాటకు మాట



వైఎస్ జగన్ ప్రజావేదికను కూల్చారన్న చంద్రబాబు.. అధికారంలోకి రాగానే వైఎస్సార్సీపీ ఆఫీసుని కూల్చారు: అంబటి రాంబాబు



కామన్‌మేన్: అక్రమ నిర్మాణాలు ఉపేక్షించేది లేదని కూల్చేసిన ప్రజావేదిక నుంచే జగన్ ప్రకటించిన విషయాన్ని మర్చిపోయావా రాంబాబూ. నీదాకా వస్తేగానీ నొప్పి తెలీలేదా? అయినా.. ప్రజల ఆస్తి ప్రజావేదికతో వైసీపీ అక్రమ నిర్మాణానికి పోలికా? నీ అపార అజ్ఞాన పాటవాలకు తిరుగులేదు బాసూ..

**అ.రా: ఏదోలా కక్షసాధింపు చేయాలనే పిన్నెల్లిపై కేసులు పెట్టారు. 307 కింద రెండు కేసులలో బుక్ చేసారు...**

కా.మే: హత్యాయత్నానికి తెగబడ్డవాడికి సంకెళ్లు వేయక శాలువాలు కప్పుతారా? జగన్ జమానాలో నేతలంతా నేరగాళ్లేగా. పిన్నెల్లి అరెస్ట్ ఓపెనింగ్ సీనే. సినిమా క్లైమాక్స్‌కి చేరేసరికి.. ఇంకెంతమంది సీటు చిరిగిపోద్దో.. వెయిట్ అండ్ సీ!

**అ.రా: ... ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీల్లో తయారు చేసిన వార్తలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.**

కా.మే: ఫ్యానుగ్యాంగులు బతుకుతున్నదే దానిమీదకదా..!!

**అ.రా: బాబు తెచ్చిన జీవో మేరకే వైసీపీ ఆఫీసుల నిర్మాణం.**

కా.మే: ఇంకా నయం, మోదీ పర్మిషనిస్తే కట్టామనలేదు.

### నవ్యాంధ్రలో మొదలైంది..

# ప్రజాభ్యుదయ పాలన!

ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలపై చంద్రబాబు సంతకాలు చేసింది.. తన మాట నెగ్గించుకోవాలని కాదు. తానిచ్చిన మాటతో, తాను పెట్టే సంతకంతో.. ఐదుకోట్ల ప్రజల ఆశలు నెరవేరుతాయని. ఇదొక్కటి చాలు.. ఆంధ్రలో అభ్యుదయ పాలన మొదలైందని చెప్పడానికి. నలుదిక్కులా ప్రగతి పూలు పూస్తాయని చెప్పడానికి..



నీరుకొండ ప్రసాద్

అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి ప్రజలు అపూర్వ మద్దతు తెలిపారు. చంద్రబాబు నాయకత్వానికి జనం జేజేలు పలికారు. 56 శాతానికిపైగా ఓట్లతో ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని కూటమి సొంతం చేసుకొంది. జిల్లాలకు జిల్లాలే కూటమి ఖాతాలోపడ్డాయి. కూటమి నాయకత్వంమీద ప్రజలు పెట్టుకొన్న నమ్మకానికి అనుగుణంగా ప్రజాభ్యుదయ పాలన ప్రారంభమైంది. సరికొత్త అధ్యాయంతో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు ఐదు సంతకాలతో శ్రీకారం చుట్టడం కూటమి ప్రభుత్వ విశ్వసనీయతకు నిలువుటద్దం. ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ముఖ్యమంత్రిగా 12న ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు, 13న సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే ఎన్నికల హామీల ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 16347 పోస్టులు భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెంచిన పింఛను అమలు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయం.

ఎన్నికల హామీలో భాగంగా రూ.3 వేల పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచడంతోపాటు, ఏప్రిల్‌నుంచే అమలు చేస్తున్నారు. పెంచిన పింఛన్లను జూలై 1నుంచి ఇంటివద్దే అందించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షలమంది లబ్ధిదారులకు ఈ మొత్తాలను సచివాలయ సిబ్బందే ఇంటింటికీ పంపిణీ చెయ్యనున్నారు. పెన్షన్ పెంపువల్ల నెలకు ప్రభుత్వంపై రూ.810 కోట్ల భారం పడగా, ఏడాదికి రూ.33,709 కోట్లు వ్యయం కానుందని సమాచారం. పింఛన్ పథకానికి ఎన్టీఆర్ భరోసా పేరు పెట్టారు. ఎన్టీఆర్ భరోసా పథకం ఆదర్శమైనదే కాదు, అపూర్వమైనది కూడా.

మెగా డీఎస్సీ నిర్వహణ నిర్ణయంపై నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగస్టు నుంచే దరఖాస్తులు స్వీకరించి డిసెంబర్‌లోపు పోస్టింగ్‌లు ఇవ్వాలనే ఆలోచనతో కొత్త ప్రభుత్వం ఉంది. కేబినెట్‌లో డీఎస్సీ నిర్వహణ ప్రతిపాదనలపై చర్చించారు. జూలై ఒకటినుంచి ప్రక్రియ ప్రారంభించి డిసెంబర్ 10లోపు 16,347 పోస్టులు భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. కేటగిరీలవారీగా ఎస్‌జీటీ 6,371, పీఈటీ 132, స్కూల్ అసిస్టెంట్స్ 7725, టీజీటీ 1781, పీజీటీ 286, ప్రిన్సిపాళ్లు 52 పోస్టులు భర్తీ చేయనున్నారు. డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు విద్యాబోధన సక్రమంగా జరిగేలా చూడాలని నిర్ణయించడం అభినందనీయం. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం కనిపిస్తోంది. వైసీపీ తెచ్చిన నల్ల చట్టంవల్ల తమ భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని, పెద్దలదే పెత్తనం అవుతుందని ప్రజలు భయపడ్డారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత బయటకు వస్తున్న వారి ప్యాలెస్‌ల వ్యవహారం చూస్తుంటే ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వెనుక పెద్ద కుట్ర ఉందనే చర్చా జరుగుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రం ఏ ఒక్కటీ ఈ చట్టాన్ని అమలు చేయలేదు. అయినా వైసీపీ ప్రభుత్వం చట్టం అమలుకు పూనుకుంది. ఈ చట్టంవల్ల సన్న, చిన్నకారు రైతులు ఆందోళన చెందారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ, న్యాయవ్యవస్థలను అస్తవ్యస్తం చేసే భయంకరమైన చట్టాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. అట్లాగే అన్న క్యాంటీన్ల పునరుద్ధరించాలని కూడా కేబినెట్ ఆమోదించింది. ఆగస్టు 15నుంచి ఒకేసారి అమల్లోకి తేవాలని నిర్ణయించారు. పేదవాడికి నాణ్యమైన భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించాలని కేబినెట్ చేసిన నిర్ణయం అభినందనీయం. రూ.5కే భోజనం అందించేలా మొదట 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు నెలలో ఒకే రోజు ప్రారంభిస్తామని, త్వరలో మరో 20 అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తేనున్నారు. దీనివలన నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో నిరుపేదలకు అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. రాష్ట్రంలో నిరుపేదలకు ఆహార భద్రత కల్పించాలన్న లక్ష్యంతో అన్న క్యాంటీన్లను నెలకొల్పి కేవలం ఐదు రూపాయలకే భోజన, అల్పాహార సదుపాయం కల్పించనున్నారు. వృత్తి నైపుణ్యంలో శిక్షణనిచ్చి వారి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో నైపుణ్య గణన కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నారు. ఇచ్చిన హామీల అమలుకు మంత్రివర్గం నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం. ఈ నిర్ణయాలన్నింటి అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు నిశిత పర్యవేక్షణలో ప్రజలకు భరోసా కల్పించగలవు. అట్లాగే గంజాయి నివారణకు హోంమంత్రి అనిత నేతృత్వంలో రెవెన్యూ, హెల్త్, గిరిజన శాఖ మంత్రులతో ఉపసంఘం ఏర్పాటు చేయడం, ఆరు శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేసి పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం, మద్యం, ఆర్థిక అంశాలతోపాటు శాంతిభద్రతల అంశంపైనా ఆయా శాఖలు శ్వేతపత్రాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జగన్ ప్రభుత్వ అరాచక, ఆర్థిక విధ్వంసం, అవినీతిని ప్రజల ముందుంచాలని కేబినెట్ నిర్ణయించడం అభినందనీయం. ముఖ్యంగా వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయానికి తెలుగుదేశం వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు పేరు పునరుద్ధరించాలని కేబినెట్ నిర్ణయించడం హర్షణీయం.

నేడు మనసున్న ప్రభుత్వాన్ని ప్రజలు తొలిసారి చూస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు గుండెలుంటాయి కానీ హృదయం అరుదు. నేడు అటువంటి హృదయమున్న ప్రభుత్వాన్ని ప్రజలు చూస్తున్నారు. చంద్రబాబు సంక్షేమ పథకాలు వెనక ఉన్నది జనాకర్షణ వ్యూహం కాదు. గత ఐదేళ్లు జగన్ పాలనలో దగాపడ్డ మధ్య తరగతి ప్రజలు, అట్టడుగు ప్రజలు వారి జీవితాల్లో వెలుగులు పూయించడమే లక్ష్యంగా పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, దళితులు.. ఇలా అన్ని వర్గాల జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్యసాధన కోసం విలక్షణమైన ఎన్నో సామాజిక పథకాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టబోతున్నారు. అభివృద్ధి ఎంతముఖ్యమో ప్రజా సంక్షేమం కూడా అంతే ముఖ్యమని గ్రహించి.. జన సంక్షేమాన్ని కాంక్షించకుండా జరిగేది అసలు అభివృద్ధే కాదని, ప్రగతికి నిజమైన జన సంక్షేమమేనని అమలు ద్వారా సీఎం చంద్రబాబు నిరూపించబోతున్నారు. ఏయే వర్గాలకు ఏయే సంక్షేమ పథకాలు అవసరమో అన్నింటినీ గుర్తించి వాటిని దశలవారీగా పారదర్శకంగా అమలుచేసి శ్రేయోరాజ్య స్ఫూర్తిని చాటనున్నారు. హామీలు ఎలా నెరవేరుస్తారంటూ వైసీపీ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కారు. కానీ అధికారం చేపట్టిన నెలరోజులలోపే ఇచ్చిన హామీలు అమలు మొదలు పెట్టారు సీఎం చంద్రబాబు. ఆయనిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం సాధ్యం కాదని వైసీపీ నాయకుల వాదన. కానీ అనుభవం, విత్తశద్ధి, పట్టుదల ఉన్న సీఎం చంద్రబాబు మాత్రం తానేంటో నిరూపించనున్నారు. అందుకే మొదటి మంత్రివర్గ భేటీలోనే ఐదు ప్రాధాన్యత అంశాలకు ఆమోదం తెలిపి ప్రజాభ్యుదయ పాలనకు శ్రీకారం చుట్టారు చంద్రబాబు. ■

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ నిర్ణయం చాలు.. చంద్రబాబు ఏతరహా పాలన అందించనున్నారో చెప్పడానికి. ఆగస్టు 15నుంచి అమల్లోకి రానున్న ఈ పథకంతో పేదవాడు ఆకలిని జయిస్తాడు. రూ.5లతో కడుపునిండా అన్నం తింటాడు. రాష్ట్రవ్యాప్తంగా 183 అన్న క్యాంటీన్లను ఒకేరోజు ప్రారంభించేందుకు బాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 20 క్యాంటీన్లనూ అందుబాటులోకి తెస్తారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో నిరుపేదలకు అన్న క్యాంటీన్లు ఆహార భద్రత కల్పించేవే.

తిండి కలిగితె కండ కలదోయ్.. కండ కలవాడేను మనిషోయ్..-అన్నారు గురజాడ అప్పారావు. రాష్ట్రంలో అన్నార్తుల ఆకలి తీర్చి మనుషులను చేయగలిగితే.. రాష్ట్రాభివృద్ధికి మానవ వనరులను సిద్ధం చేసుకున్నట్లేనన్న భావన -ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయంలో స్పష్టమవుతోంది.








# అక్షర యోధుడికి ఆత్మీయ నివాళి











## కృష్ణదేవరాయలును టీడీపీపీ నేతగా గుర్తించండి

**- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు సీఎం చంద్రబాబు లేఖ**

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు లేఖ రాశారు. టీడీపీపీ నేతల వివరాలను లేఖ ద్వారా స్పీకర్‌కు తెలిపారు. లావు శ్రీకృష్ణ దేవరాయలును టీడీపీపీ నేతగా గుర్తించాలని కోరారు. ఇక టీడీపీపీ డిప్యూటీ లీడర్లు, కార్యదర్శి, కోశాధికారి, కార్యాలయ కార్యదర్శుల పేర్లను కూడా లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు చంద్రబాబు రాసిన లేఖను లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తదితర టీడీపీ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాకు అందజేశారు. పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజుకి కూడా లేఖ కాపీని పంపించారు.

## తప్పు చేసినవాళ్లకు శిక్ష తప్పదు

**- పిన్నెల్లి అరెస్ట్‌పై దేవినేని ఉమా స్పందన**

అమరావతి: వైసీపీ నాయకుడు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి అరెస్ట్ నేపథ్యంలో, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా స్పందించారు. మాచర్లలో వైసీపీ అరాచకాలకు తెరపడిందని పేర్కొన్నారు. ఈవీఎంలను పగులగొట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, చంబల్‌లోయ మాదిరిగా సొంత సామ్రాజ్యంలా మార్చుకుని లెక్కకు మించిన తప్పులు చేశారని ఉమా విమర్శించారు. దాడులు, హత్యలతో అరాచకాలకు అడ్డాగా మాచర్లను మార్చారని ధ్వజమెత్తారు. చేసిన పాపాలు ఊరికే పోవని, ఎన్నికల హింస కేసులో కటకటాల వెనక్కి వెళ్లారని పేర్కొన్నారు. తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదు అంటూ దేవినేని ఉమా తన ట్వీట్‌ను జగన్‌కు ట్యాగ్ చేశారు. గతంలో పల్నాడులో టీడీపీ నేతల కారుపై దాడి జరిగిన దృశ్యాలను, పిన్నెల్లి ఈవీఎంను పగులగొట్టిన క్లిప్పింగ్ ను కూడా ఉమా వీడియో రూపంలో పంచుకున్నారు.

## సీఎస్ నీరభ్‌కుమార్ పదవీ కాలం ఆరు నెలలు పొడిగింపు

అమరావతి: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరభ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. జులై 1 నుంచి



డిసెంబర్ 31వరకు ఆయన సర్వీసును పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ (డీఓపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, నీరభ్ కుమార్ ప్రసాద్ ఈ నెల మొదటి వారంలో ఏపీ సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన పదవీకాలం ఈ నెలాఖరులో ముగియనుంది. అయితే, ఏపీ ప్రభుత్వం ఆయన సేవలు కొనసాగించాలని భావించి సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. చంద్రబాబు అభ్యర్థన మేరకు తాజాగా సీఎస్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

## వారానికి ఐదు రోజుల పనిదినాలు మరో ఏడాది పొడిగింపు

అమరావతి: రాజధాని ప్రాంత పరిధిలో రాష్ట్ర సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంబంధిత ఫైల్‌కు ఆమోదం తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేశారు. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉద్యోగులు విధులు నిర్వహించాలని, గురువారం నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

# ఐదేళ్లలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారు

- పోలీసుల పనితీరులో మార్పు తెస్తాం
- రెడ్‌బుక్ అనేది కక్ష సాధింపుల కోసం కాదు
- నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు
- ప్రజల భాగస్వామ్యంతో గంజాయిని అరికడతాం
- హోం మంత్రి అనిత స్పష్టీకరణ



అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారని, పోలీసులను కేవలం బందోబస్తుకే వాడారని, పోలీసు అకాడమీ, గ్రేహౌండ్స్ అకాడమీ కూడా లేదని, కేంద్రం నుంచి నిధులు వచ్చినా పోలీసు అకాడమీ నిర్మాణాలు చేయలేదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం డీజీపీ,ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ.. ఈ 12 రోజుల్లో చాలా అంశాలపై పరిశీలన చేశానని, గంజాయి రవాణా రాష్ట్రంలో బాగా పెరిగిందని, నేషనల్ క్రైం రికార్డుల్లో ఏపీని మూడో స్థానంలోకి తెచ్చారని అన్నారు. నేటికీ విశాఖ జిల్లాలో ఒక పోలీస్టేషన్ రేకుల షెడ్‌లోనే నడుస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున రూ.250 కోట్లు పోలీసుశాఖకు రావాలని అన్నారు. ఈఐదేళ్లల్లో ఈ నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పుడు జీరో నుంచి తాము పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని,ఎస్మార్ట్ వాహనాలు కూడా పని చేయడం లేదని తనకు ఫిర్యాదు చేస్తున్నారని మంత్రి అనిత తెలిపారు. 2014లో ఇచ్చిన వాహనాలే ఇప్పటికీ వాడుతున్నారని ఆశ్చ ర్యం వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్లలో పేపర్, పెన్ను ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నిధుల కొరత వల్ల పోలీ సులకు విధుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హోంశాఖకు ఎంత మేర నిధులు అవసర మో ఒక నివేదిక సిద్ధం చేశామని, ప్రాధాన్యత ప్రకారం కేటాయిస్తూ ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. నిధుల కొరత వల్ల ఒకేసారి అన్నీ చేయలేమని చెప్పారు. చాలా చోట్ల సిసి కెమెరాలు, ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు పని చేయడం లేదని, వైసీపీ ప్రభుత్వం వాటిని అసలు పట్టించుకోలేదని హోం మంత్రి అనిత అన్నారు.

### నాలుగు అంశాలపై ముందుకు

నాలుగు అంశాలను అజెండాగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నామని హోంమంత్రి తెలిపారు. గంజాయి నిర్మూలన, మహిళకు రక్షణ, పోలీసుల సంక్షేమం, పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెడ్‌బుక్ అనేది కక్ష సాధింపుల కోసం కాదన్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికారులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు. తమకు కక్ష సాధింపు ఉంటే. ఇంతకాలం ఆగుతామా అని వ్యాఖ్యానించారు. పగ, ప్రతీకారాల ఆలోచన చేయడం లేదని. తమ నాయకుడు చంద్రబాబు చెప్పిన ప్రకారం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని చెప్పారు. విశాఖలో సీపీ కార్యాలయం తాకట్టులో ఉందని, ఎప్పుడు అప్పుల వాళ్లు వస్తారో తెలియదన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో 164సీట్లు ప్రజలు ఇచ్చారని,మాకు రాష్ట్రం, ప్రజలే ముఖ్యమని.. వారి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టులో ఉన్నాయన్నారు. పోలీసులు నిబంధనలు మేరకు పని చేయాలన్నారు. రాజకీయాలు కావాలంటే బయటకి వెళ్లి ఖద్దరు చొక్కాలు వేసుకోవాలని సూచించారు. పోలీసు అంటే ప్రజల కోసం పని చేసే వ్యవస్థ అనేలా పని చేయాలన్నారు. మహిళల మిస్సింగ్ కేసులపై దర్యాప్తు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలు అదృశ్యం అయిన ఘటనలు చాలా ఉన్నాయని, ఇలాంటి సంఘటనలపై ఎవరైనా ఫిర్యాదు ఇచ్చేందుకు వస్తే వారిని కించపరిచేలా అధికారులు మాట్లాడవద్దని సూచించారు. ఏపీలో ప్రతిఒక్కరూ భద్రతగా, భరోసాగా ఉండేలా చేస్తామని హోంమంత్రి పేర్కొన్నారు.

### గంజాయి నిర్మూలనకు చర్యలు

గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇప్పటికే ఉపసంఘం ఏర్పాటు చేశాం. 100 రోజుల ప్రణాళిక ఏ విధంగా అమలు చేయాలనేదానిపై చర్చిస్తాం. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టేందుకు వీలుంటుంది. మంచి ఆలోచనతో పనిచేస్తే విప్లవాత్మక మార్పులు తీసువరావచ్చు. ఎలాంటి శిక్షణ లేకుండా సచివాల యాల్లో మహిళా పోలీసులను నియమించారు.వారు ఏ విధంగా పోలీసు విధులు నిర్వర్తించగలరు. వారి సేవలను ఏవిధంగా వినియోగించుకోవాలనే విష యాన్ని పరిశీలిస్తున్నాం. కలిసికట్టుగా పనిచేసి పోలీ సుల పనితీరులో మార్పు తెస్తాం. ప్రజలు ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకునేలా భరోసా ఇవ్వాలి. సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలి. రాష్ట్రంలో పోలీసులు ఉన్నది ప్రతిపక్ష పార్టీ నేతల అరెస్టుల కోసమే అన్నట్లుగా గత ప్రభుత్వం వ్యవహ రించింది. ఇకపై ఫ్రెండ్లీ పోలీసింగ్ రావాలి సోషల్ మీడియాలో నేటికీ నేను బాధితురాలనే. కొంతమంది ఐపీఎస్ అధికారుల తీరుతో వ్యవస్థకు చెడ్డ పేరు వస్తోంది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ కేసులుపెట్టారు.నాపైనే 23కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై విచారణ జరిపి చర్యలుతీసుకుంటాం. అక్రమ కేసులపై సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. పోలీసులంటే ప్రజల్లో ఒక నమ్మకం, గౌరవం తీసు కొస్తాం. ఏపీలో దిశ చట్టమే లేదు, ఇక ఆ పేరుతో ఏర్పాటైన పోలీసుస్టేషన్ల పేరు హుడా మార్చే ఆలోచన చేస్తామని హోం మంత్రి తెలిపాడు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

**- మంత్రి ఆనం ఉద్ఘాటన**



నెల్లూరు: ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పింఛన్ల పెంపుతో 65లక్షల పేద కుటుంబాలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. నెల్లూరులో గురువా రం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పెన్షన్ విషయంలో పేదలను మోసం చేసిందని ఆనం తెలిపారు. ఎన్నికల ముందు రూ.3 వేలు ఇస్తానని చెప్పి, ఐదేళ్ల పాలన చివరిలో ఇచ్చిం దన్నారు. అదే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి మొదటి నెల నుంచే అమలు చేస్తోందన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వా రానే పెన్షన్ పంపిణీ చేస్తామని ఆనం తెలిపారు. పంపిణీ విధానంలో పారదర్శకత ఉండేలా చూసుకుంటున్నాం. వాలంటర్ వ్యవస్థతో సంబంధం లేకుండా పెన్షన్ పంపిణీచేసి చూపిస్తాం. పెన్షన్ల పంపిణీకి బలమైన ప్రభుత్వ యంత్రాగం ఉంది. తొలి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తాం.

గత ప్రభుత్వం టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరు ద్యోగులను మోసం చేసింది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేశారు. డిసెంబర్ లోగా మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధ్వర్యంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేస్తాం. రైతు వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర వేసుకున్న గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో తెచ్చిన నల్ల చట్టాన్ని రద్దుచేయాలని నిర్ణయించాం. తరువాతి శాసనసభ సమావేశాల్లోనే చట్టం రద్దు ప్రతి పాదనను ప్రభుత్వం తీసుకువస్తుంది. నైపుణ్య గణన ద్వారా యువతలో నైపుణ్యాలను గుర్తించి, మరింత మెరుగుపరిచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలుతీసుకుంటోంది. అన్న క్యాంటీన్‌ల రద్దు ద్వారా జగన్మోహన్‌రెడ్డి పేదల కడుపు కొట్టారు. తమ ప్రభుత్వం తొలి విడతలో 183 అన్న క్యాంటీన్లను పునరుద్దరించనుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

## రైల్వే పనులు పూర్తి చేసేందుకు సహకరించండి

**కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు డాక్టర్ పెమ్మసాని వినతి**

**గుంటూరు ట్రాఫిక్ సమస్యలపై కేంద్ర రైల్వే మంత్రికి వివరణ**

గుంటూరు (చైతన్యరథం): 'గుంటూరు ప్రజల ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మీ సహకారం కావాలి.'అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో పెమ్మసాని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెమ్మసానిని అశ్విన్ వైష్ణవ్ ఆత్మీయంగా ఆహ్వానించారు.



స్థానిక నేపథ్యాలు, పరిస్థితులపై ఇరువురు కాసేపు చర్చించుకున్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఏళ్ల తరబడి పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర రైల్వే మంత్రికి వివరించారు. ముఖ్యంగా రైల్వే పనులు పెండింగ్ పడటం వల్ల ప్రజానీకం, రైతాంగం తీవ్రంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో రైల్వే సంబంధిత పనులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. పెండింగ్ పనులపై అశ్విన్ వైష్ణవ్ వివరణ కోరగా పలు ప్రాజెక్టులను, ఆయా ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇక్కట్లను గురించి పెమ్మసాని సవివరంగా తెలియజేశారు. ప్రాజెక్టులు, పెండింగ్ నిధులను గురించి తెలుసుకున్న అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్వర్యంలో దేశానికి, దేశ ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉంటామని, సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలియజేశారు.

# రూ.40 వేల కోట్ల ఖనిజాన్ని బొక్కిన వైసీపీ నేతలు

- అధికారంలో ఉండగా ఇష్టానుసారం దోపిడీ
- ప్రస్తుతం అక్రమాలకు చెక్ పెడుతున్న అధికారులు
- తప్పు చేసిన వారికి వరుసగా పెనాల్టీలు
- గగ్గోలు పెడుతున్న అవినీతి పుత్రిక 'సాక్షి'

అమరావతి, చైతన్యరథం:గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్రాన్ని అడ్డుగోలుగా దోచుకున్న వైసీపీ నేతలు సహజవనరులను కూడా వదల్లేదు. ఏ కొండ కనిపించినా, ఏ చెరువు కనిపించినా, ఏ గని కనిపించినా నిబంధనలకు నీళ్లొదిలి, అనుమతులను పక్కన పెట్టి అడ్డంగా దోచేశారు. ఇసుక కాకుండానే వీరు దోచుకున్న మిగిలిన ఖనిజాల విలువ దాదాపు 40వేల కోట్ల రూపాయలపై మాటే. ప్రభుత్వ భూములను,అటవీ భూములను, దేవుడి మాన్యాలనే కాక ప్రైవేట్ వ్యక్తుల గనులను కూడా విడిచిపెట్టకుండా దండుకున్నారు. అధికారం మారగానే వీరి పాపం పండుతోంది. ఎక్కడిక్కడ అక్రమాలన్నీ బయటపడుతున్నాయి. అధికారులు స్వేచ్ఛగా పనిచేస్తూ ఈ అక్రమాలను అడ్డుకుంటున్నారు. దీంతో వైసీపీ నేతల కనుసన్నల్లో అక్రమంగా సాగుతున్న క్వారీల పనులన్నీ ఆగిపోయాయి. తమ నేతలకు అవినీతి సొమ్ము అందడం లేదంటూ బాధపడుతున్న అవినీతి పుత్రిక 'సాక్షి' గగ్గోలు పెడుతోంది. ఇది మొత్తం టీడీపీ నేతలే చేయిస్తున్నారంటూ విష ప్రచారం మొదలు పెట్టింది. కానీ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బులుగు బ్యాచ్ సహజ వనరులను దోచుకుంటూ ఎంత విధ్వంసం సృష్టించారో అందరికీ తెలుసు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై అనేక మార్లు విచారణ జరిపిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అక్రమార్కులపై 1800 కోట్ల రూపాయల పెనాల్టీలను సైతం విధించింది.

### అక్రమ గ్రావెల్ తవ్వకాల్లో రూ.22 వేల కోట్ల దోపిడీ

ఎక్కడైనా మట్టి కనిపిస్తే చాలు ప్రొక్లెయిన్ పెట్టి తవ్వేసి టిప్పర్లు, లారీలతో వేల టన్నుల గ్రావెల్‌ను తరలించేశారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లో జరిగిన ఈదోపిడీ విలువ దాదాపు 22వేల కోట్ల రూపాయలపై మాటే.మట్టి అమ్మకాల్లో ప్రభుత్వానికి ఎగ్గొట్టిన సీనరేజీ విలువ దాదాపు మూడు వేల కోట్ల రూపాయలు. గ్రావెల్ కోసం కొండలను బోడిగుండు కొట్టేశారు. విశాఖలోని మధురవాడలో కొండవాలునంతా తవ్వేయ్యడంతో రొడ్డుపైకి పెద్ద పెద్ద బండరాళ్లు వచ్చి పడ్డాయి. పోలవరం కుడి కాలువలో మంత్రి అంబటి అనుచరులు మట్టి తవ్వకం ద్వారా దాదాపు 300 కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ కాలంలో పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న కిలారి రోశయ్య 700 ఎకరాల పండ్ల తోటలను గాయబ్ చేసి దాదాపు రెండు వేల కోట్ల రూపాయల విలువ చేసే ఎర్రమట్టిని తరలించారు. గనుల శాఖ మంత్రిగా చేసిన పెద్దిరెడ్డి స్వంత నియోజకవర్గం పుంగనూరులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రానైట్‌ను తవ్వి కంకరగా మార్చి అమ్ముకున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు పాల్పడిన అక్రమ తవ్వకాలు కోకొల్లలు.

### నెల్లూరులో రూ.1200 కోట్ల రూపాయల వైట్ క్వార్ట్జ్ అక్రమాలు

నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతలు అక్రమంగా రూ. 1200 కోట్ల రూపాయల వైట్ క్వార్ట్జ్ అమ్మకాలకు పాల్పడ్డారు. గత ఐదేళ్ల కాలంలో దాదాపు 6.5 లక్షల టన్నుల వైట్ క్వార్ట్జ్ అక్రమంగా తరలించినట్లు లెక్కించారు. ఇందులో నాలుగు లక్షల టన్నులు కేవలం 2023లోనే తరలించారు. ఒక్కో టన్ను విలువ 30 వేల రూపాయలు ఉండడంతో దాదాపు 1200కోట్ల రూపాయల అక్రమ రవాణా జరిగినట్లు తేలింది. వైసీపీ ప్రభుత్వ హయంలో ఈ అక్రమాలు చోటు చేసుకోగా వాటికి వ్యతిరేకంగా టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాలతో ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత అధికారుల దైర్యం చేసి ఎంత క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వారనే దానిపై ఒక అంచనాకు వచ్చారు. దీంతో అక్రమంగా తవ్విన వైసీపీ నేతలకు ఫెనాల్టీలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు.

### దేవుడి మాన్యాలనూ వదల్లేదు

వైసీపీ నేతలు దేవుడిని సైతం వదల్లేదు. దేవుడి మాన్యాల్లో ఉన్న కొండలను కూడా మింగేశారు. ప్రకాశం జిల్లా పాత సింగరాయకొండ నరసింహాస్వామి దేవస్థానానికి చెందిన 50 ఎకరాల్లో 15 మీటర్ల లోతు చొప్పున ఎర్ర మట్టిని తీసేసి అమ్మేసుకున్నారు. ఎన్టీయార్ జిల్లా భీమవరం కొంగర మల్లయ్య దేవస్థానానికి చెందిన 150ఎకరాల కొండను బోడిగుండు చేసేశారు. పల్నాడు జిల్లా పేటసన్నెగండ్ల సింగురట్ల లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వి తరలించారు. దీనిపైన ఎన్జీటీ విచారణచేసి వారించినా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కనపడిన కొండను, చెరువులను, క్వారీలను కబ్జా చేసి వేలకోట్ల రూపాయలు దండుకున్న వైసీపీ ముఠా ఆటలు ఇప్పుడిక సాగడం లేదు. దీంతో అవినీతి పుత్రిక 'సాక్షి' విష ప్రచారానికి దిగింది.

## పెద్దిరెడ్డికి షాక్!

- టీడీపీలోకి పుంగనూరు మున్సిపల్ చైర్మన్
- 11 మంది కౌన్సిలర్లు కూడా

తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయన సొంత నియోజకవర్గం పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషాతో పాటు మరో 11 మంది మున్సిపల్ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు ఆధ్వర్యంలో చైర్మన్, కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. అనంతరం అలీమ్ బాషా మాట్లాడుతూ పెద్దిరెడ్డి ఇలాకాలో పదవి మాత్రమే ఉంటుందని, అధికారం మాత్రం ఉండదన్నారు. పుంగనూరు మున్సిపల్ కార్యాలయంపై టీడీపీ జెండా రెపరెపలాడేందుకు చల్లా రామచంద్రారెడ్డి వ్యూహం విజయవంతమైంది. మొత్తం 31 మంది సభ్యులు ఉన్న ఈ మున్సిపాలిటీలో మరో వారంలోపు మరి కొంత మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరికకు రంగం సిద్ధం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాసి, ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకుండా.. అసలు ఎన్నికల్లో నామినేషన్లే వెయ్యనివ్వకుండా చేసి, పుంగనూరు మున్సిపాలిటీలోని 31 వార్డులను అప్పటి పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా వున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ప్రకటింపజేశాడు. తాజాగా.. చైర్మన్‌తో పాటు 11 మంది కౌన్సిలర్లు వైకాపాను వీడి టీడీపీ లో చేరారు.

కాగా ఈ పరిణామాలపై చల్లా బాబు మాట్లాడుతూ జిల్లా మొత్తాన్ని పెద్దిరెడ్డి కుటుంబం తమ గుప్పెట్లో పెట్టుకుని నియంతలా వ్యవహరించారన్నారు. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ హాలీం భాషాతో పాటు కౌన్సిలర్లు అభివృద్ధి కోసం పోరాటం చేసినా పెద్దిరెడ్డి నియంత పోకడల ముందు ఏమీ చేయలేకపోయారన్నారు.

## నెల్లూరు సెంట్రల్ జైలుకి పిన్నెల్లి

నెల్లూరు: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు నెల్లూరు సెంట్రల్ జైలుకి తరలించారు. పిన్నెల్లిని అరెస్ట్ చేసిన పోలీసులు బుధవారం రాత్రి 12గంటల సమయంలో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా 14రోజుల రిమాండ్ విధించటంతో భారీ బందోబస్తుతో నెల్లూరుకి పోలీసులు తరలించారు. మాచర్లలో రాజకీయ అరాచకాలకు వైసీపీ మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేరాఫ్‌గా మారారు. అలాంటి పిన్నెల్లి ఆట ఎట్టకేలకు ముగిసింది. ఈవీఎం ధ్వంసం, సీఐపై దాడి, టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యానికి పాల్పడిన కేసుల్లో నరసరావుపేటలో బుధవారం ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత మొత్తం పిన్నెల్లిపై 14కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు హత్యా యత్నం కేసులు ఉన్నాయి.



## జూలై 1న ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

- ఒక్క రోజులోనే పంపిణీ పూర్తికావాలి
- 65,18,496 మంది లబ్ధిదారులకు రూ.4,399.89 కోట్ల పంపిణీ
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 6కే పంపిణీ ప్రారంభించాలి
- ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు కేటాయింపు
- అవసరం మేరకు ఇతర శాఖల ఉద్యోగులకు పురమాయింపు
- అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ నీరభ్ కుమార్ ఆదేశం



అమరావతి:ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం అమల్లో భాగంగా నూతన ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పింఛన్లను జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరభ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65,18,496 మంది ఫించను దారులందరికీ పెంచిన ఫించన్లను ఒక్క రోజులోనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయించాలన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పింఛన్ల పంపిణీ విషయంలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటవ కేటగిరీలోని వృద్ధులు, వితంతువులు తదితర 11ఉప కేటగిరీలకు చెందిన వారి పింఛను సొమ్మును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1వ తేదీన రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి పెరిగి పింఛను సొమ్ము నెలకు రూ.1,000 చొప్పున మూడు మాసాల బకాయిలు కలుపుకుని మొత్తం రూ.7,000ను పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండో కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, మూడో కేటగిరీలోని పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.5వేల నుండి రూ.15 వేలకు మరియు నాలుగో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 వేల నుండి 10 వేలకు పెంచిన పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని సూచించారు.

### 29నే నగదు సిద్ధం చేసుకోవాలి

పెంచిన ఫించన్ల మేరకు రూ.4,399.89 కోట్ల మొత్తాన్ని 65,18,496 మంది ఫించను దారులకు ఒక్క రోజులోనే పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో రూ.4,369.82 కోట్లను 64.75లక్షల పింఛను దార్ల ఇళ్ల వద్ద, మిగిలిన సొమ్ము రూ.30.05 కోట్లను రాష్ట్రానికి బయట ఉండే 0.43 లక్షల పింఛను దారులు, బయట చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు డిబిటి పద్ధతిలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇళ్ల వద్ద నగదు రూపేణా పంపిణీ చేయాల్సిన పింఛను సొమ్మును 29వ తేదీ శనివారం నాడే సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌ల నుండి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జూలై 1న ఉదయం 6.00 గంటల నుండి పింఛను దార్ల ఇంటి వద్దే సొమ్మును పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం మేరకు ఇతర శాఖల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాల చొప్పున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అప్పగించే విధంగా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం కల్లా పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత మేర ఒకే రోజు ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండో రోజు కూడా ఈ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు.ఆధార్ బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిష్, ఆర్బీఐఎస్ అథెంటిఫికేషన్ ఆధారంగానే పింఛను సొమ్మును పంపిణీ చేయాలని, పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ సర్టిఫికెట్‌ను కూడా జారీ చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వానికి ఎటువంటి మాట రాకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర గృహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శులు సౌరబ్ గౌర్, సత్య నారాయణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్, తదితరులతోపాటు అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## 'కల్కి' బృందానికి లోకేష్ అభినందనలు



అమరావతి: ప్రభాస్ హీరోగా అత్యంత భారీ వ్యయంతో అంతర్జాతీయ స్థాయిలో సినిమా తీశారంటూ 'కల్కి' చిత్ర బృందానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపిక పదుకొణే ప్రధాన పాత్రల్లో నటించిన భారీ చిత్రం కల్కి 2898 ఏడీ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు అన్ని రివ్యూలు అద్భుతం అనే రీతిలో వస్తున్నాయి. హాలీవుడ్‌కు తెలుగు చిత్ర పరిశ్రమ ఇచ్చిన జవాబు ఈ 'కల్కి 2898 ఏడీ' అని సినీ విమర్శకులు అంటున్నారు. కాగా, ఈ చిత్రంపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్పందించారు. "కల్కి 2898 ఏడీ చిత్రం రివ్యూలు అద్భుతంగా ఉన్నాయి. చాలాసంతోషంగా ఉంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపిక పదుకొనే, దర్శకుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. కళాఖండం అనదగ్గ ఈ చిత్రంతో భారతీయ సినిమాను పునర్ నిర్వచించారు.నిర్మాతలు అశ్వినీదత్, స్వప్న, ప్రియాంకలకు ప్రత్యేక అభినందనలు. అన్ని సినీ సూత్రాలను తిరగరాసి తెలుగు సినిమాను అంతర్జాతీయ బరిలో నిలిపారని ఎక్స్‌లో లోకేశ్ అభినందనలు తెలిపారు.

# నాణ్యమైన సేవలతో ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం

**- రాయచోటిలో నూతన బస్సులను ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి చైతన్యరథం: ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించి సురక్షితమైన ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి బస్టాండ్‌లో మంత్రి రాంప్రసాద్ రెడ్డి నూతన బస్సులను ప్రారంభించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం కోసం రాబోయే కాలంలో మరిన్ని నూతన బస్సులను ప్రారంభిస్తామని, రెండు రోజుల క్రితం కుప్పం పర్యటనలో భాగంగా నూతన బస్సులను ప్రారంభించడం జరిగిందని వివరించారు. ప్రయాణి కులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమీక్షించి మెరుగైన సేవలు అందించేందుకు తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళా ఉచిత ప్రయాణాన్ని త్వరలోనే ప్రారంభం చేస్తామని చెప్పారు. చిన్న వయసులో క్యాబినెట్‌లో చోటు కల్పించడమే కాకుండా కీలక శాఖలు తనకు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్ బాబు లకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం విలేకరుల ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులు ఆక్రమించుకొని ఆర్టీసీని నిర్వీర్యం చేశారన్నారు. కాబోయే కాలంలో ఆర్టీసీని ప్రక్షాళన గావించి ప్రయాణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని నూతన బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం రాయచోటి పట్టణ శివారులోని నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు. పోలీసు బలగాలు చేరుకున్నాయి. నిర్మాణం గురించి జేసీ, ఆర్డిఓ లతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేస్తే ఏదో జిల్లాలు అభివృద్ధి జరుగుతాయనీ ఆశించామని. కానీ అభివృద్ధి జరగకపోవడం దారుణం అన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి 26 జిల్లాలలో ప్రజల భూములను కాజేసి వైసీపీ కార్యాలయాల కోసం పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తుండడం సహేతుకం కాదన్నారు. ప్రజాధనంతో ప్రజల భూములను కబ్జా చేసి వైసీపీ కార్యాలయాలను నిర్మిస్తున్న ఘనత మా కడప జిల్లా వాసి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందనీ విమర్శించారు. గతంలో రాజులు కూడా ఇలాంటి కోటలను నిర్మించి ఉండరనీ విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

**- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం చైతన్యరథం : ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని టిడిపి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో చిత్తూరు జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార సంఘం అధ్వర్యంలో జరిగిన పిఎంఎజెఎవై పథకం ద్వారా మహిళలకు తార్పాలు, డ్రమ్ములు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మహిళా రైతులు ముందుకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏ విధంగా అయితే మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని ఆశించారో, అదేవిధంగా నేడు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మహిళ రైతులు ముందుకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని



కలిగించిందన్నారు. ఈ సందర్భంగా 154 మంది మహిళా రైతులకు డ్రమ్ములు, తార్పల్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో పాటురాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్ బాబు, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, అధికారులు, మహిళ రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు తోడుగా నిలవడంలో ముందుండాలి

**- న్యాయబద్ధంగా పని చేసిన వారికి బిల్లులు చెల్లించండి**

**- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి అధికారులకు ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు సూచన**

నరసరావుపేట (చైతన్యరథం): ప్రజలకు మేలు చేసే పనులు చేసిన వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్ లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, రూరల్ వాటర్ సప్లై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలకు అవసరమయ్యే పనులు చేసి బిల్లులురాక అవస్థలు పడుతున్న వారికి తక్షణమే బిల్లులు చెల్లించాలని సూచించారు. గత ఐదు సంవత్సరాల్లో టీడీపీ కార్యకర్తలు బిల్లుల కోసం కాళ్ళ అరిగేలా తిరిగారు. ఇప్పుడైనా అధికారులు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా బిల్లులు చెల్లించాలని సూచించారు. తెలుగుదేశం రైతులు సామాన్య పౌరులకు మేలు చేయడమే లక్ష్యంగా ఎన్నో పనులు చేసింది. అలాంటి పనులు చేసిన వారికి బిల్లులు



రాక ఇబ్బంది పెట్టడం ఎంతవరకు భావేమని ప్రశ్నించారు. చిన్న సన్న కారు కుటుంబాలకు చెందిన వారు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. అందరికీ న్యాయం చేయాలని అధికారులు సూచించారు. అధికారులు కూడా బాధ్యతాయుతంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. మనది ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా మన అడుగులు ముందుకు పడాలని అధికారులను ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు సూచించారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి



కడప చైతన్యరథం : పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి సూచించారు. కడప నగరం14వ డివిజన్ ప్రకాష్ నగర్ చంద్రమౌళి స్కూలులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాధవిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తాను గెలువడంతో ఎన్నికల సమయంలో తాను చెప్పిన విధంగా నగర అభివృద్ధి, మహిళల రక్షణ, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో పేద విద్యార్థులు మెరుగైన విద్యను అందించేందుకు ప్రతి పాఠశాలను తనిఖీ చేసి అక్కడి సమస్యల పరిష్కారానికి పాటుప డతామని తెలిపారు. అలాగే ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపా ధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలబడు తుందని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి వారి బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుం దని వివరించా రు.విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు.

## సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పులివర్తి



రామచంద్రాపురం చైతన్యరథం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలో చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని రైతులకు సబ్సిడీపై వేరుశనగ కాయల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ 30 కిలోల వేరుశెన కాయలు సబ్సిడీ పోను రైతులు 1720 రూపాయలు చెల్లించి తీసుకోవచ్చు అన్నారు. అలాగే రాయలచెరువు అభివృద్ధిపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించానన్నారు. రాయలచెరువులో నీరు నిల్వ ఉండడం ద్వారా రైతులకు నీటి కొరత ఉండదన్నారు. తిరుపతి అగ్రహారం నుండి రాయలచెరువు వరకు ఉన్న గుంతల రోడ్డును వారం రోజుల్లోగా తారు నిర్మాణం పూర్తవుతుంది అన్నారు. అధికారులందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి అభివృద్ధి కొరకు ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా మహిళా అధికారులు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి లేదా సతీమణి సుధా రెడ్డి దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఎన్నికల ముందు అభివృద్ధి కొరకు చెప్పిన వాగ్దానాలన్నీ నాలుగు సంవత్సరాలలో పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, ఢిల్లీ నాదరెడ్డి, గంటాల జీవరత్నం, గిరి నాయుడు, సురేంద్ర నాయుడు, మండల బిజెపి, జనసేన నాయకులు,మండల అధికారులు రైతులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు సకాలంలో అవసరమైన వరి విత్తనాలు అందించాలి

**- సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**

సూళ్లూరుపేట చైతన్యరథం : వ్యవసాయ రంగంలో రారాజులైన అన్నదాతలకు అవసరమైన వరి వంగడాలను సకాలంలో సబ్సిడీ విధానంలో వారికి అందేలా చూడాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆమె మండల వ్యవసాయ అధికారులు ఏర్పాటుచేసిన పచ్చి రొట్ట ఎరువు విత్తనాలను రైతులకు సబ్సిడీలో పంపిణీ చేశారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు వచ్చేందుకు, భూమి సారవంతంగా ఉండేందుకు ఉపయోగిస్తున్న పిల్లి పెసరు, జీలుగ, జనము విత్తనాలను తక్కువ ధరలకే సబ్సిడీ రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్నదాత దేశానికి వెన్నెముకని, రైతే రాజని అన్నారు. ప్రభుత్వపరంగా అన్నదాతలకు వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను సకాలంలో చేరేలా చూడాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు గ్రామాలలో పర్యటించి, వారి భూములకు అనువైన పంటలు



వేసుకునేందుకు సూచనలు చేయాలని తెలిపారు. అంతేకాకుండా పొదుపు సిబ్బంది మహిళలు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలుకుతూ వారికి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాసులు నాయుడు,మాజీ ఎంపీపీ ఇట్టిగుంట రత్నయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జకరయ్య, మైనార్టీ నాయకులు ఎస్. కె షబీర్, ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్ రెడ్డి వ్యవసాయ శాఖ ఏడి అనిత, ఏఓలు జ్యోతిర్మయి, కవిత, కాంచన ఉద్యానవన శాఖ అధికారులు, పొదుపు ఏరియా కోఆర్డినేటర్ మురళి ఏపిఎం పద్మావతి సీసీలు చంద్ర నారాయణ సూళ్లూరుపేట తెలుగుదేశం నాయకులు సుధాకర్ రెడ్డి,దొరవారిసత్రం మండల నాయకులు యాగాని. ఆది ముని, కృష్ణమూర్తి, ఉదయ్ కుమార్, మురళి రెడ్డి, బాబు నాయుడు, కిషోర్ కిషోర్ నాయుడు రాజేంద్రప్రసాద్ జాన్ రమేష్ తెలుగు ప్రాజెక్టు సిబ్బంది,డిప్యూటీ తాసిల్దార్ గోపిరెడ్డి, ఎంపీడీవోఓ, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ అఫీషియో సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన తాతయ్య



జగ్గయ్యపేట (చైతన్యరథం): జగ్గయ్యపేట మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య బాధ్యతలు స్వీకరించారు. గురువారం జగ్గయ్యపేట పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని ఎక్స్ అఫీషియో సభ్యులుగా సంతకం చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ... జగ్గయ్యపేట పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. మున్సిపల్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చి సమగ్ర అభివృద్ధి కోసం అందరం ముందుకు వెళ్దాం అన్నారు. మున్సిపల్ ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకి జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావులు పూల బొకేలు అందచేశారు.

## పెన్షన్ల పంపిణీపై నక్కా ఆనందబాబు సమీక్ష

**- జూలై 1వ తేదినే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందించాలని ఆదేశం**



గుంటూరు (చైతన్యరథం): జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం అమలుపై గురువారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి, వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని ఎమ్ పీడీవో లతో సమావేశమైన ఆయన జూలై 1వ తేదిన పెన్షన్ పంపిణీపై చర్చించారు. ఒకటోతేది ఉదయం ఆరు గంటల నుంచి పెన్షన్ల పంపిణీ మొదలుపెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తం పెన్షన్ల పంపిణీ ఒకటోతేదినే పంపిణీ చేయాలని, మిగిలిన పెన్షన్లు 2వ తేది లోపు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాలని కోరారు. ఎన్నికల హామీల్లో ఒకటైన పెన్షన్ పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల మొదటి సంతకం చేశారని, ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలు కలిపి మొత్తం రూ.7 వేలు పెన్షన్ లబ్ధిదారులకు అందించబోతున్నామని తెలిపారు. ఇంటి వద్దకే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, పెన్షన్ల పంపిణీ నిమిత్తం ఒకొక్క ఉద్యోగికి 50 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి అవకతవకలు ఉండకూడదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆనందబాబు అధికారులను ఆదేశించారు.

# లైంగిక వేధింపుల అంశంపై ఎమ్మెల్యే సునీత సీరియస్

**- సాక్షాలతో సహా ఎమ్మెల్యేకి చూపించిన ఏఎన్ఎంలు**

**- వైద్యునిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సునీత ఆదేశం**



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలంలో సంచలనం రేపిన లైంగిక వేధింపుల అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత సీరియస్ అయ్యారు. ఎస్ఎస్ గేటు ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు ఉదయ్.. ఏఎన్ఎంల పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అంశం ఇప్పటికే జిల్లాలో కలకలం రేపింది. తమను డాక్టర్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఆస్పత్రికి సంబంధించిన పలువురు ఏఎన్ఎంలు పుట్టపర్తిలో డీఎంహెచ్ మంజుల వాణికి ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్ ఆదేశాల మేరకు... వైద్యుల కమిటీ బృందం ఎస్ఎస్ గేట్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టింది. తాజాగా ఏఎన్ఎంలు ఈ అంశాన్ని మాజీ మంత్రి పరిటాల సునీత దృష్టికి తీసుకొచ్చారు. వైద్యుడు చేసిన వాట్సప్ చాట్ ను సునీతకు చూపించారు. సాక్షాలు ఉన్నా.. వైద్యునిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంపై పరిటాల సునీత ఒకింత సీరియస్ అయ్యారు. వెంటనే డాక్టర్ ఉదయ్ పై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓకి సూచించారు. మహిళల పట్ల ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఇలాంటి వేధింపులు ఉంటే.. ఇక బయట పరిస్థితి ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని తమ ప్రభుత్వం క్షమించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. ఏఎన్ఎంలకు ధైర్యం చెప్పి.. కచ్చితంగా చర్యలు ఉంటాయని భరోసా ఇచ్చారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాలపై పరిటాల సునీత ఫోకస్.

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై పరిటాల సునీత ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా విద్యకు సంబంధించిన అంశాల మీద వరుసగా రివ్యూ చేస్తున్నారు. తాజాగా రామగిరి మండల కేంద్రంలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఆమె సమావేశమయ్యారు. కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.. ఇంకా ఏమేమి కావాలనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కళాశాలకి అంబులెన్సు, మిని బస్, ఎల్.సి.డి ప్రొజెక్టర్, సి.సి కెమెరాలు కావాలని, కాంపౌండ్ వాల్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అన్ని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని.. త్వరలోనే వీటిని మంజూరయ్యేలా చూస్తామని సునీత అన్నారు. విద్య విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడదని ఆమె స్పష్టం చేశారు.

# ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా స్పీకర్ ఎలా ఇస్తారు?

**- చట్టబద్ధంగా ఏవిధంగా కూడా ప్రతిపక్ష హోదా కూడా రాదు**

**- టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎం. థారునాయక్**



అమరావతి (చైతన్యరథం): వైసీపీ నాయకుడు జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదని, ఏ పార్టీలూ ఎవరికీ ప్రతిపక్ష హోదా ఇవ్వవనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎం.థారునాయక్ వ్యాఖ్యానించారు. ఎవరిని ఎక్కడ కూర్చోబెట్టాలి అనేది ప్రజలే నిర్ణయిస్తారని, ఏ నిబంధన ప్రకారం చూసినా.. వైసీపీకి ప్రతిపక్ష హోదారాదని స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాల శాసనసభలు, పార్లమెంటరీ సంప్రదాయాలు, గతంలో స్పీకర్లు ఇచ్చిన మార్గదర్శకాలను పరిశీలించినా ఇదే స్పష్టమవుతుందన్నారు. శాసన సభాపతికి జగన్ రాసిన లేఖను పరిశీలిస్తే ప్రజలిచ్చిన తీర్పును ఆయన ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారని అర్థమవుతోందని, రాష్ట్రంలో జీతాలు, భత్యాలు, పెన్షన్లు ఇచ్చే చట్టం ప్రకారం ప్రతిపక్ష హోదా వస్తుందన్నారు. మంత్రుల కన్నా ముందే ప్రతిపక్ష నాయకుడు ప్రమాణస్వీకారం చేయాలని జగన్ స్పీకర్‌కి రాసిన లేఖలో పేర్కొన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకుడు కాదు... కేవలం ఆ పార్టీకి నాయకుడు.. ఫ్లోర్ లీడర్ మాత్రమే అవుతారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ తాను చిటికేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదని ఇదే శాసనసభ సాక్షిగా అనేకసార్లు చెప్పారని, ఆయన ఎన్నిసార్లు చిటికెలు వేసినా.. చంద్రబాబు వెనకున్నవారు ఎవరూ ఎక్కడికీ వెళ్లలేదన్నారు. ఆయన మాటలను బట్టి ప్రతిపక్షహోదా ఉండాలంటే ఎంతమంది పార్టీ ఎమ్మెల్యేలు ఉండాలో తెలుసని అర్థమవుతోందన్నారు. ప్రజల తరపున వైసీపీ పోరాటం చేయాలని, ప్రజలు గుర్తిస్తే ప్రతిపక్ష హోదా దక్కొచ్చు అని వెల్లడించారు. ప్రతిపక్షహోదా కావాలని స్పీకర్‌కు లేఖలు రాసిన జగన్... పార్టీలను బెదిరిస్తేనో, ప్రజల తీర్పును తప్పుపడితేనో ప్రతిపక్ష హోదా రాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ఏదోక వంకపెట్టి సభకు హాజరుకాకుండా ఉండాలని.. ప్రజల నుంచి ఏదోలా సానుభూతి పొందాలని చూస్తున్నారని ఎం. థారునాయక్ మండిపడ్డారు.

# ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్న ఎమ్మెల్యే పూసపాటి

**- వరద ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే**



విజయనగరం (చైతన్యరథం): ఇళ్లలోకి వచ్చిన వరదనీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే పూసపాటి విజయలక్ష్మీ గజపతి రాజు ఆకస్మికంగా సందర్శించి స్థానికులు ఎదుర్కొంటున్న పరిస్థితులు అడిగితెలుసుకున్నారు. పట్టణం రాజీవ్‌నగర్ కాలనీ మొదటిలైన్‌లో గత 15 ఏళ్లుగా అక్కడ నివాసముంటున్న ప్రజలు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు ఇటీవల మా నివాసాల ప్రక్కన గల మాన్సాస్ స్థలాన్ని ఆక్రమించి, అక్రమ నిర్మాణం చేసి వాహనాల వాటర్ సర్వీస్ సెంటర్ ను నడుపుతున్నారని, అందుచేత కాలువను దారిమళ్లించడం వలన మా ఇళ్లల్లోకి వరద నీరు వస్తుందని ఎమ్మెల్యే కి తెలిపారు. గత రెండు రోజులుగా పడుతున్న చిన్నపాటి వర్షాలకే ఇటువంటి పరిస్థితి ఉంటె రాబోయే వర్షాకాలంలో మేము ఇళ్లల్లో నివసించలేని దారుణ పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే వీరభద్రస్వామి హయాంలో ఇలాంటి భూ ఆక్రమణలు, భూ దందాలు ఎన్నో జరిగాయని, ప్రతిరోజు ఏదో ఒకటి బయటకు వస్తుందని, కనీసం కాలువను కూడా వదల్లేదని, దీనివలన ఈ ప్రాంత ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మా తాతగారు పివిజి రాజు మన ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం మాన్సాస్ ద్వారా భూములు ఇచ్చారని, అంతేకాని అధికారం ఉంది కదా అని ఆక్రమణలు చేసి అక్రమ నిర్మాణాలు కట్టుకుని ప్రజలను ఇబ్బందులు పెట్టడానికి కాదని అన్నారు. ప్రజలు కూడా అందుకే ఇటువంటి తీర్పు ఇచ్చి వారిని ఇంటికి పంపించారని అన్నారు. అదేవిధంగా సంబంధిత అధికారులకు కూడా మాన్సాస్ భూములను పరిరక్షించే బాధ్యత ఉంటుందని, అందరు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే సరిపోతుందని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు.



కనిగిరిలో జనసీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొందిన మహిళలకు మాజీ కౌన్సిలర్ బొగ్గరపు శ్రీలత సద్గురు సహకారంతో కుట్టు మిషన్లను పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి.. పాల్గొన్న తెలుగుమహిళలు..

# త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

## - పార్లమెంట్ ఉభయ సభల సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- గత పదేళ్లలో సుస్థిర అభివృద్ధి
- ఆరోగ్య రంగంలో నెంబర్ వన్ స్థానంలో దేశం
- నీట్, తదితం పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం



ఢిల్లీ: కొత్తగా కొలువుదీరిన 18వ లోక్‌సభతో పాటు రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రసంగించారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వ ప్రాధమ్యాలను ఆమె వివరించారు. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్‌కు చేరుకున్న రాష్ట్రపతికి గజ ద్వారం వద్ద ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉభయ సభలనుద్దేశించి ప్రథమ పౌరురాలు ప్రసంగం చేశారు. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులను అభినందించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఈసీకి అభినందనలు. ఈ ఎన్నికల్లో ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారు. విజాయతీని నమ్మి ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి మీరంతా (లోక్‌సభ సభ్యులు) సభకు వచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో సభ్యులు విజయవంతమవుతారని ఆశిస్తున్నా. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి" అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

### పరీక్షల్లో పారదర్శకత ఉండాలి...

ఈసందర్భంగా ఇటీవల నీట్, నెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో వెలుగుచూసిన అక్రమాలను రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. "ప్రభుత్వం చేపట్టే నియామకాలు, పరీక్షల్లో పవిత్రత ఉండాలి. పారదర్శకంగా జరగాలి. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో ఉన్నతస్థాయిలో విచారణ జరుగుతోంది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరముంది. నీట్, తదితర పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. పేపర్ లీకేజ్ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ముర్ము తెలిపారు. రాష్ట్రపతి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ "ప్రభుత్వం పదేళ్లలో సుస్థిర అభివృద్ధిని సాధించింది. జమ్మూకశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, ఈసారి కశ్మీర్ లోయలో మార్పు కన్పించింది. శత్రువుల కుట్రలకు అక్కడ ప్రజలు గట్టిగా బదులిచ్చారు. ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. రిఫార్స్, ఫర్‌ఫార్స్, ట్రాన్స్‌పార్స్ (సంస్కరణలు, పనితీరు, మార్పు) ఆధారంగా ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. చిన్న, సన్నకారు రైతుల కోసం పీఎం సమ్మాన్ నిది కింద ఇప్పటివరకు రూ..20లక్షల కోట్లు ఇచ్చాం. ఆర్థిక భరోసా కోసం నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నాం. ఈ రోజుల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా భారత్ ఉత్పత్తులు అందిస్తోంది. ఆరోగ్య రంగంలో దేశం అగ్రగామిగా ఉంది. ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోంది. దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. 70 ఏళ్లు దాటిన వారందరికీ... ఆయుష్మాన్ భారత్ కింద సేవలు కల్పిస్తున్నాం. ప్రజా సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. నారీమణుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. పెద్ద ఎత్తున మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం. ఈ రంగంలో భారీగా పెట్టబడులు పెట్టాం. ప్రపంచ వృద్ధిలో భారత్ 15శాతం భాగస్వామ్యం అవుతోంది. అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. గ్రీన్ ఎనర్జీ సాధన దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా రోడ్ల విస్తరణ జరుగుతోంది. పౌర విమానయాన రంగంలో పలు మార్పులు తీసుకొచ్చాం. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఆ డిజిటల్ ఇండియా సాధనకు ప్రభుత్వం సంకల్పించింది. బ్యాంకుల క్రెడిట్ బేస్ పెంచి వాటిని బలోపేతం చేశాం. డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగాయి. సైనిక దళాల్లో స్థిరమైన సంస్కరణలు రావాలి. మన బలగాలు స్వయంసమృద్ధి సాధించాయి. రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేశాం. సైనికులకు ఒకే ర్యాంకు ఒకే పింఛను అమలు చేశాం. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి. సీఏఏ కింద శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం కల్పించింది. జులై 1 నుంచి కొత్త నేర చట్టాలు అమల్లోకి రానున్నాయి. ఎమర్జెన్సీ దేశ చరిత్రలో చీకటి అధ్యాయం. రాజ్యాంగంపై జరిగిన అతిపెద్ద దాడి. అత్యయిక స్థితి నాటి రోజుల్లో దేశ ప్రజలు ఎన్నో బాధలు అనుభవించారు. కానీ అటువంటి రాజ్యాంగ విరుద్ధ శక్తులపై వ్యతిరేకంగా దేశం విజయం సాధించింది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చేందుకు విభజన శక్తులు కుట్రలు పన్నుతున్నాయి. ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే ఏ చర్యనైనా మనమంతా తీవ్రంగా ఖండించాలి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# బీహార్‌లొ కూలిన మరో వంతెన..

## - వారం రోజుల వ్యవధిలో నాలుగో ఘటన



పాట్నా: బీజేపీ-జేడీయూ కూటమి పాలనలోని బీహార్ రాష్ట్రంలో వరుసగా వంతెనలు కూలిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే మూడు బ్రిడ్జిలు కుప్పకూలగా.. తాజాగా మరో వంతెన కూలిపోయింది. కిషన్‌గంజ్ జిల్లాలో కంకై నదికి చెందిన ఉపనదిపై నిర్మించిన 70 మీటర్ల పొడవైన వంతెన కూలిపోయింది. ఈ వంతెన బహదూర్‌గంజ్ దిఘల్‌బ్యాంక్ బ్లాక్‌లను కలుపుతుంది. ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడంతో రెండు పట్టణాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కంకై నదిలో నీటిమట్టం పెరిగినట్లు పేర్కొన్నారు. నీటి ప్రవాహం ఉధృతి కారణంగా వంతెన మధ్యలో ఉన్న పలు స్తంభాలు సుమారు ఒకటిన్నర అడుగుల మేర మునిగిపోయాయని వివరించారు. కాగా, వారం వ్యవధిలోనే బీహార్ రాష్ట్రంలో వంతెనలు కూలిపోవడం వరుసగా ఇది నాలుగో ఘటన. అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో గత మంగళవారం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. రూ.12 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనలో అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టలేదు. దీంతో ఈ వంతెనపై ప్రజా రవాణాకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. బక్రా నదిపై కుర్సా కంటా, సిక్టీ ప్రాంతాలను కలుపుతూ ఈ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి కూలడానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఆ తర్వాత శనివారం ఉదయం సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. దారౌందా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్..చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ కుమార్ గుప్తా తెలిపారు. ఆ తర్వాతి రోజు అంటే ఆదివారం తూర్పు చంపారన్‌లో నిర్మాణంలో ఉన్న 16 మీటర్ల వంతెన కుప్పకూలింది. మోతిహారి బ్లాక్‌లో ఘోరసహాన్‌లో జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ముప్పు వాటిల్లలేదని జిల్లా అధికారులు వెల్లడించారు. అమ్వా అనే గ్రామాన్ని ఇతర ప్రాంతాలకు కలుపుతూ కెనాల్‌పై ఈ బ్రిడ్జ్‌ను రూరల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నది. మోతీహరిలో రూ.1.5 కోట్లతో 40 అడుగుల విస్తీర్ణంలో వంతెన నిర్మిస్తున్నారు. ఇది ఆదివారం రాత్రి 12 గంటలకు అది ఒక్కసారిగా కూలిపోయింది. సిమెంటు, ఇసుక తగినపాళ్లలో సరిపోకపోవడం, కాస్టింగ్ కోసం ఏర్పాటుచేసిన సెంట్రింగ్ పైపు బలహీనంగా ఉండటంతో బ్రిడ్జి కూలిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరుసగా వంతెనలు కూలిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు, కాలువలపై నిర్మించిన వంతెనల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వర్క్స్‌లో నాణ్యతా లోపాలు, అక్రమాల వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. వరుస ప్రమాదాలతో అధికారులు కూడా ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా..? లేక ఎవరైనా కావాలనే కూల్చి వేస్తున్నారా..? అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

# అరుంధతీరాయ్‌కు పెన్ పింటర్ ప్రైజ్ అవార్డు



న్యూఢిల్లీ: ఈ యేటి పెన్ పింటర్ ప్రైజ్ అవార్డును అరుంధతీ రాయ్ గెలుచుకున్నది. నోబెల్ గ్రహీత, రచయిత హారాల్డ్ పింటర్ జ్ఞాపకార్థం పెన్ పింటర్ అవార్డును ఏర్పాటు చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన ఘటనలో రెండు వారాల క్రితమే అరుంధతీ రాయ్‌పై యూఏపీఏ కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బ్రిటీష్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఈ బహుమతిని అందజేయనున్నారు. అక్టోబర్ 10వ తేదీన అవార్డు సెర్మనీ ఉంటుంది. ఆ కార్యక్రమంలో అరుంధతీ రాయ్ మాట్లాడనున్నారు. బ్రిటన్, ఐర్లాండ్ లేదా కామన్‌వెల్త్ దేశాల్లో ఉంటూ.. సాహితంలో అద్భుత ప్రతిభను ప్రదర్శించే వారికి పెన్ పింటర్ ప్రైజ్ అందజేస్తారు. ఇంగ్లీష్ పెన్ ఛైర్మన్ రూత్ బోర్త్‌విక్, నటుడు ఖలిద్ అబ్దల్లా, రైటర్ రోజర్ రాబిన్‌సన్‌లతో కూడిన జ్యూరీ అరుంధతీ రాయ్‌ని అవార్డు కోసం ఎంపిక చేసింది. గతంలో ఈ అవార్డు గెలుచుకున్న వారిలో మైఖేల్ రోసెన్, మార్గరేట్ అట్‌వుడ్, మలోరి బ్లాక్‌మాన్, సల్మాన్ రష్దీ, టామ్ స్టాపార్డ్, కారల్ ఆన్ డఫీ ఉన్నారు.

# నీట్ పరీక్షా పేపర్ల లీకు కేసులో ఇద్దరి అరెస్ట్

ఢిల్లీ: నీట్-యూజీ పేపర్ లీక్ కేసుకు సంబంధించి సీబీఐ గురువారం బిహార్‌లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. పట్నా నుంచి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన నిందితులను మనీష్ ప్రకాష్, అశుతోష్‌గా గుర్తించారు. ఇక నీట్ పరీక్ష నిర్వహణలో లోటుపాట్లు, ప్రశ్నాపత్రాల లీకేజ్, నెట్-యూజీసీ 2024 పరీక్ష వివాదంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ఢిల్లీలో నిరసనలు చేపట్టారు. వివిధ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకేజీలు కొనసాగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నీట్-యూజీ ఎగ్జామ్ చుట్టూ ముసురుకున్న వివాదాలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. పేపర్ లీక్‌లు, అక్రమాల ఆరోపణలతో విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్రంగా కలత చెందుతున్నారని యూత్ కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు.

## బొలీవియాలో సైనిక తిరుగుబాటుకు యత్నం.. ఆర్మీ జనరల్ అరెస్ట్

లా పాజ్: బొలీవియాలో సైనిక తిరుగుబాటుకు ఆర్మీ ప్రయత్నించింది. అధ్యక్షుడి భవనంలోకి ఆర్మీ వాహనాలు దూసుకెళ్లాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్మీ జనరల్ జువాన్ జోస్ జునిగాను అరెస్టు చేశారు. బుధవారం మధ్యాహ్నం అధ్యక్ష భవనం, కాంగ్రెస్‌కు నిలయమైన సెంట్రల్ ప్లాజా స్క్వేర్‌లోకి సైనిక దళాలు చొచ్చుకెళ్లాయి. అధ్యక్ష భవనం తలుపును ఆర్మీ వాహనం ఢీకొట్టింది. అనంతరం సైనికులు లోపలకు దూసుకెళ్లారు. కాగా, బొలీవియా అధ్యక్షుడు ఆర్స్, సైనిక తిరుగుబాటుపై ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈరోజు దేశం తిరుగుబాటు ప్రయత్నాన్ని ఎదుర్కొంటోంది. నేడు మరోసారి బొలీవియాలో ప్రజాస్వామ్యం చిన్నబోయింది' అని అధ్యక్ష కార్యాలయం నుంచి సందేశం పంపారు. తిరుగుబాటుకు వ్యతిరేకంగా బొలీవియన్ ప్రజలు సంఘటితమై ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మరోవైపు మిలిటరీ కమాండర్‌గా జోస్ విల్సన్ శాంచెజ్‌తో అధ్యక్షుడు ఆర్స్ ప్రమాణం చేయించారు. శాంతిభద్రతలను పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. దీంతో సైనికులు తమ యూనిట్లకు తిరిగి వెళ్లాలని కొత్త ఆర్మీ కమాండర్ శాంచెజ్ ఆదేశించారు. సైనికులు రక్తం చిందించవద్దని ఆయన కోరారు. చివరకు బుధవారం సాయంత్రం అధ్యక్షుడి భవనం ప్రాంతం నుంచి సైనికులు వెనుతిరిగారు. ఆ వెంటనే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఆర్మీ జనరల్ జువాన్ జోస్ జునిగాను అరెస్ట్ చేసి రహస్య ప్రదేశానికి తరలించారు. మరోవైపు బొలీవియాలో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని అమెరికా పేర్కొంది. ప్రశాంతంగా ఉండాలని, సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది.